



టమోటాతోపాటు ఇతర కూరగాయల ధరలు మండిపోతున్నాయి. గడిచిన నెల రోజులుగా పెరిగిన ధరలు అదుపులోకి రావడం లేదు. ఆకు కూరలు సైతం అదిరపోయే ధరలు ఉండటంతో కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు.



కూరగాయలు	ధర రూపాయల్లో
టామోట (కేజీ)	100
పచ్చిమిర్చి	70
క్యారెట్	80
బీరకాయ	70
చిక్కుడు కాయ	70
క్యారెట్	80
ఉర్లగడ్డ	70
బీట్‌రూట్	70
చిక్కుడుకాయలు	60
మునక్కాయలు	70
దొండకాయ	70
బెండకాయ	70
దోసకాయ	70
కాకర కాయ	70
వంకాయలు	70
కొత్తిమీర(కట్ట)	50
ఆకు కూరలు(కట్ట)	10

ధరలు దౌడు

సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రభారం

టమాటా ఒక్కోటి.. గుడ్డు ధరతో సమానం

ఘాటెక్కిస్తున్న ఉల్లిగడ్డలు


కేజీ రూ.35 నుంచి రూ.75కి పెరిగిన వైనం

ఇతర కూరగాయలదీ అదే తీరు

కిలో వంటనూనె రూ.140కి పైనే

దిగుబడి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు

ఒంగోలు(కార్పొరేషన్), అక్టోబరు 10 : పండుగ వేళ ధరలు మండిపోతున్నాయి. ఇటు నిత్యావసరాల నుంచి అటు కూరగాయల వరకు సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయి. నెలరోజుల క్రితం



బెంబేలెత్తిస్తున్న ఉల్లిపాయలు

వరకు కేజీ రూ.30 పలికిన ఉల్లి ధర ఇప్పుడు రూ.75, రూ.80కి చేరింది. దీంతో వంటింట్లో ఆ పేరు చెబితేనే కన్నీళ్లు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఉల్లిపాయలు అత్యధికంగా కర్నూలు, షోలాపూర్ నుంచి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, అక్కడ వర్ష ప్రభావంతో పంట దెబ్బతినడంతో పాత సరుకునే ప్రస్తుతం అమ్మకాలు చేస్తున్నారు. ప్రత్యేకించి గతంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన ఉల్లిపాయలను కేజీ రూ.70 నుంచి రూ.80 వరకు అమ్ముతుండగా, నెలరోజులు నుంచి కొనుగోలు చేస్తున్న ఉల్లిపాయలను రూ. 45 నుంచి రూ. 60 వరకు అమ్ముతున్నారు. వాటిని ఎక్కువ రోజు నిల్వ ఉంచే పరిస్థితి లేదు. తడి ఆరని కారణంగా ఎక్కువ రోజులు నిల్వ ఉంటే మొక్కలు వచ్చే పరిస్థితి ఉండటంతో పాత ఉల్లిపాయలకు డిమాండ్ పెరిగింది. ప్రతి ఏటా ఇదే సీజన్‌లో ఉల్లిపాయలకు డిమాండ్ రావడం సాధారణమే అని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ఏడాదిలో ఒకటి, రెండు నెలలు మాత్రమే కర్నూలు నుంచి రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాలకు దిగుమతి అవుతుండగా, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అక్కడ కూడా పంట చేతికి రాకపోవడంతో వాటి ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణ రోజుల్లో నెలకు సుమారు 10 నుంచి 15 టన్నులు జిల్లాకు వస్తుండగా, ప్రస్తుతం పంట నష్టం రావడంతో దిగుబడి తక్కువ కారణంగా ప్రస్తుతం 5 నుంచి 8 టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదని వ్యాపారులు అంటున్నారు. అందుకే ఉల్లిపాయలకు డిమాండ్ పెరిగిందని చెబుతున్నారు.

టారెత్తిస్తున్న టమాటా

టమాటా ధరలు ఆకాశాన్నంటాయి. ఐదు రోజులుగా కేజీ రూ.100 పలుకుతున్నాయి. సాధారణ సైజు టమోటాలు కేజీకి 14 వరకు వస్తున్నాయి. ఒక్కొక్క టమోటా రూ.7 పడుతోంది. ఇది కోడి గుడ్డు ధరతో సమానంగా ఉంది. ఒక టమాటా కొనే కన్నా ఒక గుడ్డు కొనుక్కోవడం మేలనే పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ల నుంచి జిల్లాలో టమాటా సాగు లేకపోవడంతో మదనపల్లి, పలమనేరు, పుంగనూరు నుంచి వ్యాపారులు కొంటున్నారు. రోజుకు 30 నుంచి 40 టన్నుల సరకు జిల్లాకు వస్తోంది. కేవలం ఒంగోలుకే అత్యధికంగా 25 టన్నుల వరకు సరఫరా అవుతోంది. నెల క్రితం వరకు పంట దిగుబడి అధికంగా ఉండటంతో ధర లేక కేజీ రూ.20 నుంచి రూ.40 వరకు అమ్మకాలు జరిగేవి, గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోవడంతో ఉన్న అరకొర సరుకునే దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం రోజుకు 20 టన్నులు మార్కెట్‌కు చేరుతుండగా, కేవలం మూడు టన్నుల టమాటా రైతు బజారుకు చేరుతోంది. పంటసాగు తగ్గడంతోపాటు దిగుబడి తగ్గడంతో మదనపల్లి, పలమనేరు, పుంగనూరులోనే రైతు వద్ద నుంచి కేజీ రూ.80 కొనుగోలు చేయాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు, లాభం కలుపుకుని మార్కెట్‌లో కేజీ రూ.100 అమ్ముతున్నారు. ఇదే పరిస్థితి మరో పది, పదిహేను రోజులు ఉండేలా ఉంది.

నిత్యావసరాల ధరలు దౌడు తీస్తున్నాయి. సామాన్య కుటుంబాలకు పండుగను దూరం చేస్తున్నాయి. జేబు నిండా డబ్బు తీసుకెళ్తే సంచి నిండా సరుకులు రాని దుస్థితి నెలకొంది. గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్టు సరుకుల ధరలను తట్టుకోలేక అల్లాడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై కూరగాయల ధరలు కూడా కనికరం చూపడం లేదు. నిన్న మొన్నటి వరకు అందుబాటు ధరలో ఉన్న టమాటా ఐదు రోజులుగా కిలోకి నూరు దాటి జనం నోటమాట రాకుండా చేస్తోంది. ఉల్లిగడ్డ కొయ్యకుండానే కన్నీరు పెట్టిస్తోంది. ఏ కూరగాయ కొన్నా కిలో రూ.70కిపైనే ఉంటోంది. నూనెలు సలసల కాగుతున్నాయి. వరదల వల్ల ఉత్పత్తి తగ్గిపోవడం ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

దిగుబడి తగ్గిన కారణంగానే ధర పెరుగుదల



ఉల్లిపాయల ధరలు ఈ సీజన్‌లో పెరుగుతూనే ఉంటాయి. ముఖ్యంగా వర్షా కాలంలో వచ్చే అధిక వర్షాలతో పంట నష్టం రావడం, దిగుమతి తగ్గిపోవడమే ప్రధాన కారణం. దీనికి వ్యాపారులు చేయగలిగింది ఏమీ లేదు. పంట దిగుబడి అధికంగా ఉంటే, తక్కువ ధరకే అమ్మే అవకాశం ఉండేది. డిమాండ్‌ను పట్టి అక్కడి వ్యాపారులు ధర నిర్ణయిస్తారు. దానికి అనుగుణంగా, ట్రాన్స్‌పోర్టు, పాడైపోయిన ఉల్లిని గ్రేడింగ్ చేసి తక్కువ లాభానికి అమ్ముకోవాల్సిన పరిస్థితి. అయినా ప్రజలపై ధరల భారం ఎక్కువగానే ఉంది.

\- కటారి కృష్ణ, ఉల్లిపాయల హోల్‌సేల్ వ్యాపారి

మండిపోతున్న వంట నూనె



నెల రోజు క్రితం వరకు అందుబాటులో ఉన్న వంట నూనె ఇప్పుడు ఏకంగా కేజీ రూ.140కి పెరిగింది. గతంలో రూ.100లోపు ఉన్న కేజీ ఫ్రీడమ్ రూ.140కి పెరగ్గా, పామాయిల్‌లు ఇప్పుడు రూ.125కి పెంచేశారు. వేరుశనగ నూనె ధర నిలకడగానే ఉంది. నిరంతరం వంటకు నూనె అవసరం కావడంతోపాటు, హోటళ్లు, ఇతర మాంసాహార పదార్థాల విక్రయాలు, రోడ్‌సైడ్ తినుబండరాలైన బోండాలు, బజ్జీలు ఇతరత్రా వ్యాపారులు, చికెన్ పకోడి వంటి చిరు వ్యాపారులకు ఒక్కసారిగా పెరిగిన నూనె ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఒక్కో బాక్స్ పది కేజీల ప్యాకెట్‌లు లభిస్తుండగా ఒక్క బాక్స్‌పై ఏకంగా రూ.400కు పైగా పెరగడంతో అటు చిరు వ్యాపారులు, టిఫిన్ సెంటర్లు, బిర్యానీ సెంటర్లు వారు ధరలను ఒక్కసారిగా పెంచేశారు.



మద్యం కిక్కు

విదేశాల నుంచి దుకాణాలకు దరఖాస్తు

ఇప్పటివరకు 2,481 దాఖలు.. ఆ ఫీజు ద్వారా రూ.49.62 కోట్లు

లైసెన్స్ ద్వారా మరో రూ.106 కోట్ల ఆదాయం

ఒంగోలు(క్రైం), అక్టోబరు 10 : కిక్ బాగుంది. నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. తొలుత ఈనెల 9 వరకు దాఖలుకు గడువు ఇచ్చిన ప్రభుత్వం దానిని 11 వరకు పెంచింది. అదేక్రమంలో జిల్లాలో మద్యం వ్యాపారం చేసేందుకు విదేశాల నుంచి దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. న్యూజెర్సీలో ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు ఒంగోలులోని మూడు దుకాణాలకు దరఖాస్తు చేశారు. 2017 తరువాత మద్యం దుకాణాలకు తిరిగి దరఖాస్తులు తీసుకోవడం 2024లో కావడంతో అప్పట్లో మద్యం వ్యాపారం చేసిన పాత వారితో పాటు ప్రసుతం యువ వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా ఉత్సాహం చూపుతున్నారు. అదేక్రమంలో ఈ ఏడాది మద్యం దుకాణాల ఫీజును ప్రభుత్వం భారీగా పెంచేసింది. కేవలం లైసెన్స్ ఫీజు ద్వారానే రూ.106.05 కోట్లు ఆదాయం రానుంది. మొత్తం 171 మద్యం దుకాణాలు ఉండగా 120 దుకాణాలకు రూ.65 లక్షలు, 51 దుకాణాలకు రూ.55లక్షలు చొప్పున మొత్తం రూ.106.05 కోట్లు వసూలు కానుంది. దరఖాస్తు ఫీజు రూపంలో రూ.49.62 కోట్లు ప్రస్తుతానికి వచ్చింది.

నేటితో గడువు పూర్తి

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే గడువు శుక్రవారం సాయత్రం 7 గంటలతో ముగియనుంది. గురువారంరాత్రి వరకు 171 దుకాణాలకు 2,481 దరఖాస్తులు వచ్చాయి. అదేక్రమంలో 10కి తక్కువగా వచ్చిన దుకాణాలకు తిరిగి దరఖాస్తులు కోరే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గాల వారీగా ఆయా దుకాణాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి అనేది కూడా అధికారులు పరిశీలన చేస్తున్నారు.

సీఎం కానుక.. గీతకార్మికుడికి మద్యం దుకాణం

మద్యం నూతన పాలసీలో భాగంగా గీత కార్మికులకు జిల్లాలో ప్రభుత్వం 17 మద్యం దుకాణాలు కేటయించింది. గత నెల 20న సీఎం చంద్రబాబునాయుడు నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కానుకగా గీత కార్మికుడు ఆలుదాసు శ్రీనుకు దుకాణం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో 18 మద్యం దుకాణాలకు ప్రత్యేకంగా మరో నోటిఫికేషన్ రానుంది. కల్లుగీత కార్మికులకు కేటాయించే దుకాణాల లైసెన్స్, దరఖాస్తు ఫీజు కూడా రాయితీ ఉంటుందని ప్రచారం జరుగుతోంది.

వైభవంగా కళారాల ఉత్సవం



ఒంగోలు నగరంలో కళారాల ఉత్సవం గురువారం అర్ధరాత్రి వైభవంగా ప్రారంభమైంది. బాలాజీరావుపేట కనకదుర్గమ్మ గుడి, బీవీఎస్ హాలు ఎదురు ఉన్న నరసింహస్వామి గుడి, ఏనుగు చెట్టు వద్ద కాళికమ్మ గుడుల నుంచి ఒక్కోటి చొప్పున బయలుదేరాయి. ఊరేగింపు తెల్లవారు జాము వరకూ కొనసాగింది. పలువురు కళాకారుల వేషధారణలు, డప్పు వాయిద్యాలు విశేషంగా అలరించాయి. -ఒంగోలు కల్చరల్



ఒంగోలులో కురుస్తున్న వర్షం

జిల్లావ్యాప్తంగా జల్లులు

పలుచోట్ల మోస్తరు వాన

చల్లబడిన వాతావరణం

జనజీవనానికి ఆటంకం

ఒంగోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా జల్లులు పడుతున్నాయి. కొన్నిప్రాంతాల్లో ఒక మోస్తరు వాన పడింది. రెండురోజులుగా ముసురు పట్టి తెరలు,తెరలుగా పడుతున్న జల్లులు జనజీవనానికి కొంత ఆటంకం కలిగించాయి. నిన్న మొన్నటి వరకు ఉన్న ఎండల తవ్రత, ఉక్కపోత తగ్గడంతో ప్రజలు కాస్తంత ఊపిరిపీల్చుకుంటున్నారు. గత పక్షం రోజులుగా జిల్లాలో పొడి వాతావరణమే ఉండగా మంగళవారం రాత్రి నుంచి జల్లులు పడుతూనే ఉన్నాయి. బుధవారం పగలు, రాత్రి పలుచోట్ల ఒక మోస్తరు వాన కురిసింది. జిల్లాలో గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో సగటున 9.70 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా టంగుటూరు మండలంలో 37.20 మి.మీ కురవగా కొండపిలో 30.6, తాళ్లూరులో 25.2, బీపేటలో 24.60, మద్దిపాడులో 21.20, త్రిపురాంతకంలో 20.4 మి.మీ కురిసింది. కనిగిరి, కొనకనమిట్ల, సంతనూతలపాడు, పొన్నలూరు, ఒంగోలు తదితర మండలాల్లో 15 నుంచి 20 మి.మీ పడింది. మరో ఐదారు మండలాల్లో జల్లులు పడ్డాయి. తిరిగి గురువారం పగటిపూట కూడా జిల్లాలోని చాలాప్రాంతాల్లో జల్లులు పడుతూనే ఉన్నాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతం కావడంతో పాటు తెరలుతెరలుగా జల్లులు పడ్డాయి.

జిల్లాలో గురువారం పగటిపూట ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, కనిగిరి, మార్కాపురం, హెచ్ ఎంపాడు, పొదిలి, కేకేమిట్ల, తాళ్లూరు, తర్లుపాడు, రాచర్ల తదితర మండలాల్లో 20 నుంచి 35 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా పగటిపూట అంతా జల్లులు పడుతుండటంతో పట్టణవాసుల రోజువారీ పనులకు ఆటంకం ఏర్పడింది.

భైరవకోన అద్భుతం

సినీ నటుడు శ్రీకాంత్ • గుడిలో ప్రత్యేక పూజలు

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 10 : ఒకేరాతిలో దేవాలయాలతోపాటు దేవతామూర్తుల విగ్రహాలను చెక్కడం అద్భుతమని, ఇక్కడ కళాశిల్ప నైపుణ్యం బాగుందని సినీ నటుడు శ్రీకాంత్ కొనియాడారు. దేవీ నవరాత్రుల సందర్భంగా సీఎస్‌పురం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన భైరవకోనను ఆయన గురువారం సందర్శించారు. త్రిముఖ దుర్గాంబిక అమ్మవారిని, శివయ్యను, భైరవేశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా సందర్భంగా మహిమ గల అమ్మవార్ల క్షేత్రాలను దర్శించుకునే క్రమంలో ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకాంత్‌ను శేషవస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.



భైరవకోన క్షేత్రాన్ని దర్శించుకున్న సినీ నటుడు శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న సభ్యులు





వైద్య విద్యార్థిని చదువుకు ఎమ్మెల్యే చేయూత



సుమను అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

నాగులుప్పలపాడు అక్టోబరు 10 : పేద విద్యార్థిని డాక్టర్ చదువుకు ఎమ్మెల్యే బీఎస్.విజయ్ కుమార్ చేయూత నిచ్చారు. మండలంలోని ఉప్పుగుండూరు దళిత కాలనీలోని పేద కుటుంబానికి చెందిన మున్నంగి రవి తేజ, ఆనందకుమారి దంపతుల కుమార్తె సుమ ఇటీవల ప్రకటించిన నీట్ పరీక్ష ఫలితాలలో రాష్ట్రస్థాయిలో 2,600 ర్యాంక్, ఆలిండియాలో 83,000 ర్యాంక్ సాధించారు. గుంటూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఉచిత సీటు పొందారు. అయితే మెడికల్ కళాశాలలో చేరేందుకు వివిధ రకాల ఫీజులను చెల్లించాల్సి ఉంది. వాటిని చెల్లించే స్తోమత లేక విద్యార్థిని సుమ తల్లిదండ్రులు ఇబ్బందిపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్ తక్షణమే స్పందించి సుమ, ఆమె తల్లిదండ్రులను ఒంగోలులోని తన కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా గురువారం రూ.50వేల నగదును తల్లిదండ్రులు రవితేజ, ఆనందకుమారి, గ్రామస్తుల సమక్షంలో విద్యార్థిని సుమకు అందజేసి అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే బీఎస్ ఆకాంక్షించారు.

టెట్‌కు 471మంది హాజరు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 10 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు గురువారం రెండు సెషన్లలో 471మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. జిల్లాలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో ఒంగోలు బ్రిలియంట్‌కంప్యూటర్ ఎడ్యుకేషన్, మార్కాపురంలోని కృష్ణచైతన్య ఇంజనీరింగ్ కాలేజీల్లో మాత్రమే పరీక్ష జరగ్గా మధ్యాహ్నం సెషన్‌లో మూడుపరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. రెండు సెషన్లలో 550మంది అభ్యర్థులను కేటాయించగా 471 మంది పరీక్షకు హాజరు కాగా 79మంది గైర్హాజరయ్యారు. మార్కాపురం శ్యాముల్ ఇంజనీరింగ్ కాలేజీలో ఉదయం 155మంది అభ్యర్థులను కేటాయించగా 131మంది హాజరుకాగా 24మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 395మందిని కేటాయించగా 53మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల స హాయ క మిషనర్ కె.శివకుమార్ తెలిపారు.



అచలానంద ఆశ్రమంలో దుర్గామాత అలంకరణ



వాసవి ఆలయంలో..

కొతపట్నంరోడ్డులోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఎంపీ మాగుంట పూజలు



పూజలలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, నాయకులు



కళారాల ఊరేగింపులో కళాకారుడి విన్యాసం



మహిషాసురమర్దిని ఆలయంలో..



అమ్మవారి కళారానికి హారతి ఇస్తున్న అర్చకుడు



గంటాపాలెంలో గాజులతో అలంకరణ



లాయర్‌పేట సాయిబాబా ఆలయంలో

దుర్గామాతా దయచూపమ్మా

దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు ● వైభవంగా కళారాల ఊరేగింపు

పలు ఆలయాల్లో ఎమ్మెల్యే దామచర్ల, ఎంపీ మాగుంట పూజలు ● నేడు మహర్నవమి

ఒంగోలు(కల్చరల్), అక్టోబరు 10: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో ఎనిమిదవ రోజైన గురువారం అమ్మవారు పలు దేవాలయాలలో మహాదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఒంగోలులోని కేశవస్వామిపేట శ్రీవిజయదుర్గాదేవి ఆలయం, మంగమూరు రోడ్డు గాయత్రి మందిరం, శ్రీఅచలానందఆశ్రమం, బాలాజీరావుపేట శ్రీపార్వతీదేవి దేవస్థానం, గంటాపాలెం పోలేరమ్మ, మహాలక్ష్మి దేవస్థానాలు, కొత్తపట్నం బస్టాండు శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం, కేశవస్వామిపేట శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, అమలనాధుని వారి వీధి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం మొదలైన పలు ఆలయాలలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా కళారాల ఉత్సవం

నగరంలో గురువారం రాత్రి కళారాల ఉత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గురువారం రాత్రి ప్రారంభమైన కళారాల ఊరేగింపు తెల్లవార్లు కొనసాగింది. ఈ సందర్భంగా పలువులు కళాకారుల వేషధారణలు, డప్పు వాద్యాలు, యువకుల నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి.

నేడు మహర్నవమి

ఇక శరన్నవరాత్రి ఉత్సవాలలో అత్యంత కీలకమైన చివరి మూడురోజులలో శుక్రవారం మహర్నవమి పండుగ. ఈ రోజు అమ్మవారు మహిషాసురమర్ధనిగా భక్తులకు దర్శనమియ్యనున్నారు. ఈరోజున అమ్మవారు రాక్షససంహారం చేశారని, అందుకే ప్రజలు ఆనందంతో మరుసటి రోజైన దశమిని విజయదశమిగా జరుపుకుంటారని పురాణ ప్రతీతి.

కొప్పోలులో దుర్గాదేవిగా

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీచెన్న కేశవస్వామి దేవాలయంలో శరన్నవరాత్రులలో భాగంగా గురువారం దుర్గాష్టమి సందర్భంగా శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకుడు పరాంకుశం సమీర్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

మల్లవరంలో..

మద్దిపాడు: మల్లవరంలోని శ్రీవేంకటేశ్వస్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉప్పుగుండూరులో లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తాం : ఏఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నాగులుప్పలపాడు అక్టోబరు 10 : ఉప్పుగుండూరు గ్రామంలో నెలకొన్న లోవోల్టేజి సమస్యను పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ ఇన్‌చార్జ్ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'ఊళ్లో సబ్‌స్టేషన్..అయినా లోవోల్టేజీ' అనే కథనం ప్రచురితం కావడంతో ఆయన స్పందించారు. గ్రామంలో లోవోల్టేజీ సమస్య ఉన్న మాట వాస్తవమన్నారు. దానిని అధిగమించేందుకు గత ఏడాది గ్రామం వెలుపల నుంచి యూనియన్ బ్యాంక్ వద్దకు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి 11 కేవీ లైన్ తీసుకొచ్చి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టగా వైసీపీ నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. దీంతో ఆయా పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. త్వరలోనే ఆ పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తామన్నారు.

డ్వామా పీడీ విచారణ

నాగులుప్పలపాడు అక్టోబరు 10: ఉపాధి హామీ పథకం కింద సాగు చేసిన పండ్ల మొక్కలు వివిధ కారణాలతో చనిపోయాయని, అయితే అధికారులు తనతో అకారణంగా రికవరీ కట్టించారని గత నెల 12న చీర్వానుప్పలపాడు గ్రామానికి చెందిన మేడికొండ మురళీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాంతో గురువారం డ్వామా పీడీ జోసఫ్ కుమార్ చీర్వానుప్పలపాడులో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఫిర్యాదిదారు, ఉపాధి సిబ్బందిని విచారించారు.

జడ్పీసీఈవో పరిశీలన

నాగులుప్పలపాడు అక్టోబరు 10: స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో భూపతి చిరంజీవి గురువారం పరిశీలించారు. సాధారణ పరిశీలనలో భాగంగా వచ్చిన ఆయన కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను తెలుసుకొన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి మరమ్మతు పనులతో నూతన కళ సంతరించుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.మహాలక్ష్మి, ఈవోఆర్డీ మురళి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి : డీఈ

నాగులుప్పలపాడు అక్టోబరు 10: ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని డీఈ చెన్నరాయుడు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణాలపై సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ చెన్నరాయుడు మాట్లాడుతూ గతంలో నిర్మాణాలు చేపట్టి వివిధ దశలలో నిలిచిపోయిన వాటిని పురోగతిలోకి తీసుకురావాలన్నారు. ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకొనేలా లబ్ధిదారులను సంసిద్ధం చేయాలని చెప్పారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తే ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించేందుకు సిద్ధం ఉందన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఎన్టీఆర్ గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈ ఎ.రాజేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్లు లాజర్, శ్రీనివాసరావు, పలు గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రేషన్‌షాపులపై 6ఏ కేసులు

సంతనూతలపాడు, అక్టోబరు 10: మండలంలోని రెండు గ్రామాల్లో రేషన్‌దుకాణాలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి ఉండాల్సిన బియ్యం బస్తాల కన్నా ఎక్కువ ఉండటంతో 6ఏ కేసులు నమోదు చేశారు. ఎం.వేములపాడులోని నీలం సింగయ్య రేషన్‌షాపు, పి.తక్కెళ్లపాడులోని సుబ్బారావు రేషన్‌దుకాణంపై ఫిర్యాదులు రావడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఫిరోజ్, పొదిలి ఫుడ్‌ఇన్‌స్పెక్టర్లు దాడిచేశారు. ఈ సందర్భంగా ఎం.వేములపాడులో 60 బస్తాలు, పి.తక్కెళపాడులో 6 బస్తాలు అధికంగా ఉండటంతో 6ఏ కేసులు నమోదు చేసి బియ్యం బస్తాలను సీజ్ చేసి ఆయా గ్రామ వీర్వోలకు స్వాధీనం చేశారు.

నగరంలో వాన



వర్షంలో ఆటోల రాకపోకలు

ఒంగోలు (కార్పొరేషన్), అక్టోబరు10: గత కొద్దిరోజులుగా ఎండ తీవ్రతతో సెకండ్ సమ్మర్‌ని తలపించింది. ఇటీవల కాలంలో మండు టెండలు..ఉక్కపోతలతో అల్లాడిన నగర ప్రజలకు ఉపశమనం లభించింది. గురువారం ఒంగోలులో కురిసిన కుండపోత వానకు అటు ప్రజలు ఊపిరి పీల్చుకోగా, ఇటు నగర వీధులు జలమయంగా మారాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపునీటికి తోడు మురుగుతోడై రోడ్లపై ప్రవహించి చెరువులను తలపించాయి. దీంతో నగరవాసులు ఇబ్బంది ఏర్పడినప్పటికీ చల్లనివాతావరణంతో ఊరటచెందారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు, అక్టోబరు 10: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య చర్యలు చేపట్టారు. రాత్రి సమయంలో డ్రైవర్లు నిద్రమత్తు కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతాయని, అందువల్ల రాత్రి వారికి ముఖం కడిగించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. గురువారం రాత్రి ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఎల్ఐసీని నిర్వీర్యం చేయడం తగదు



మార్కెటింగ్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏజెంట్లు

ఒంగోలు(రూరల్), అక్టోబరు10: ఎల్ఐసీని నిర్వీర్యం చేసే విధానాలు కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం (లియాఫి)నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఒంగోలులోని ఎల్ఐసీ కార్యాలయంలో డివిజనల్ మార్కెటింగ్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు ఎం.ప్రసన్నరాజు మాట్లాడుతూ ఎల్ఐసీ పాలసీపై ప్రీమియం రేట్లు పెంచటం తగదన్నారు. రూ.లక్ష పాలసీలను రూ.2లక్షల సమ్ ఇన్సూరెన్స్ పాలసీగా పెంచటం వల్ల పేదలు ఎల్ఐసీ కట్టకుండా దూరం చేసేలా ఉందని ఆరోపించారు. పేదలకు తక్కువ ధరలో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించటం ఎల్ఐసీ బాధ్యతని చెప్పారు. ఇక ప్రీమియంలపై వివిధ రకాల టాక్స్‌లు వసూలు చేయడం తగదన్నారు. ఎల్ఐసీ బాండ్లు ఆన్‌లైన్ మార్కెట్‌కు విడుదల చేయటంతో ఏజెంట్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పాతపద్ధతిలోనే ఏజెంట్లకు కమీషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏజెంట్లు పి.వెంకటేశ్వర్లు, మధు, గోవిందు, మధు, రాంబాబు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

14నుంచి హెచ్ఎంలకు శిక్షణ

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 10: ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులకు ఈనెల 14నుంచి 19 వరకు ఏలూరు జిల్లా అగిరిపల్లిలోని హీల్ ప్యారడైజ్‌లో ఆరు రోజులపాటు లీడర్ షిప్‌పై రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసులు గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా 300 మంది ప్రధానోపాధ్యాయులను ఎంపిక చేయగా వారిలో జిల్లా నుంచి 14 మంది ఉన్నారు. జడ్పీ హైస్కూళ్ళు, కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల నుంచి హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్ళు, స్పెషల్‌ఆఫీసర్లను ఎంపిక చేశారు. శిక్షణకు హాజరయ్యే వారికి నిబంధనల ప్రకారం టీఏ, డీఏలు చెల్లిస్తారు. ఎంపిక చేసిన వారిని శిక్షణకు పంపాలని డీఈవోలు, ఏపీసీలను ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా సాయిఅపర్ణ



ఒంగోలు(క్రైం), అక్టోబరు10: విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్‌గా నూతలపాటి సాయిఅపర్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అవినీతి నిరోధకశాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆమె విజిలెన్స్‌కు బదిలీ అయ్యారు. ఈమేరకు ఒంగోలులోని జిల్లా రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ జె.కులశేఖర్ వద్ద సాయిఅపర్ణ రిపోర్టు చేశారు.

గుండ్లాపల్లిలో చోరీ

మద్దిపాడు, అక్టోబరు 10: గుండ్లాపల్లిలోని ఓ ఇంటిలో చోరీ జరిగిన సంఘటన గురువారం జరిగింది. మద్దిపాడు పోలీసుల వివరాల మేరకు.. గుండ్లాపల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన సర్వీసు రోడ్డులో గుర్తు తెలియని దొంగలు రాజస్థాన్‌కు చెందిన ముత్తు ఇంటిలో జొరబడి 2 సవర్ల బంగారం, రూ.30వేల నగదు చోరీ చేశారు. ఒంగోలు నుంచి వచ్చిన క్లూస్ టీం చోరీ జరిగిన ఇంటిలో ఆధారాలను సేకరించారు. ఎస్సై శివరామయ్య సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రతన్‌టాటాకు రోటరీ క్లబ్ ఘన నివాళి

చీమకుర్తి, అక్టోబరు 10: వ్యాపార దిగ్గజం రతన్‌టాటా మృతికి పలువురు ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తిలోని కిరణ్ ఎక్స్‌పోర్ట్స్ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘు కిరణ్ రతన్‌టాటా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కడవా రామకృష్ణ, కందుకూరి వెంకటసుధాకర బాబు, మన్నం నాగరాజు, గొల్లపూడి వెంకట్రావు, పరాంకుశం శ్రీనివాసమూర్తి, అంబటి వీరారెడ్డి, నాగేళ్ల సత్యం, పోతుల వీరనారాయణ, అడుసుమల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. స్థానిక బస్టాండ్‌సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో శిద్దా సుధాకర్, మన్నం ప్రసాద్‌లు పాల్గొని రతన్‌టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉన్నం సుబ్బారావు, నూకల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రఘుకిరణ్, రోటరీ సభ్యులు

ఎంపీ మాగుంట సంతాపం

ఒంగోలు(కలెక్టరేట్): పద్మవిభూషణ్, టాటా సంస్థల చైర్మన్ రతన్‌టాటా మృతి పట్ల ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. రతన్‌టాటా అనారోగ్యంతో మృతి చెందడం కలిచివేసిందన్నారు. లక్షల మందికి జీవనోపాధి కల్పించిన మహోన్నతమైన వ్యక్తి మృతి తీరని లోటని పేర్కొన్నారు.

22న జిల్లా పరిషత్ సమావేశం

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 10: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీ ఉదయం పదిన్నర గంటలకు స్థానిక పాత జడ్పీ సమా వేశపు హాలులో జరుగుతుందని జడ్పీ సీఈవో బి.చిరంజీవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అధ్యక్షతన జరిగే సభలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. అధికారులందరూ సకాలంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


పోతులకు శాలువాకప్పి సత్కరిస్తున్న పోలేరమ్మ గుడి నిర్వాహకులు

పోలేరమ్మ గుడి వద్ద అన్నసంతర్పణ

టంగుటూరు, అక్టోబరు 10 : టంగుటూరు గ్రామ దేవత పోలేరమ్మ గుడిలో వైభవంగా శరన్నవరాత్రులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో దాదాపు 7వేల మంది భక్తులు హాజరైనట్లు పోలేరమ్మ తల్లి ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు హాజరై భక్తులకు ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో గుడి యాజమాన్యం సభ్యులు పమిడి కోటయ్య, పమిడి తులసీరావు, పమిడి సుబ్బారావు, పమిడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

దుర్గాదేవి అలంకరణలో వల్లూరమ్మ

వల్లూరు (టంగుటూరు), అక్టోబరు 10 : మండలంలోని వల్లూరులో వేంచేసిఉన్న శ్రీవల్లూరమ్మ దేవస్థానంలో అమ్మవారి దసరా నవరాత్రులు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రుల్లో ఎనిమిదో రోజైన దుర్గాష్టమి నాడు వల్లూరమ్మను దుర్గాదేవి అలంకరణలో వైభవంగా తీర్చిదిద్దారు. ప్రత్యేక అలంకరణలోని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చనలు గావించారు.

జరుగుమల్లి (కొండపి) : దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కామేపల్లిలోని పోలేరమ్మ భక్తులకు గురువారం ఉదయం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు భారీగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు శ్రీధర శ్రీనివాసశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో బైరాగి చౌదరి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో విషజ్వరాలు

కొండపి : మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలాయి. గడిచిన ఐదారు రోజులుగా కొండపి ప్రాంతంలో అడపాదడపా వర్షం పడుతూనే ఉంది. ఈకారణంగా నీటినిల్వలు గ్రామాల్లో పెరిగాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలోని కోయవారిపాలెం, పెట్లూరు, వెన్నూరు, ముప్పవరం గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలాయి. జరుగుమల్లి మండలంలోని పచ్చవ గ్రామంలో విష జ్వరాలు ప్రబలాయి.

గ్రా'నైట్' అక్రమం



- అడ్డదారుల్లో శ్లాబుల రవాణా
- రూట్‌కో రేటు ● తప్పించుకునేందుకు యత్నాలు

చీమకుర్తి, అక్టోబరు 10 : గ్రానైట్ అక్రమార్కులు తమ జీరో దందా రవాణా పంథాను రోజుకోతీరున మారుస్తున్నారు. బిల్లులు లేకుండా గ్రానైట్ శ్లాబులను రవాణా చేసే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైన్స్, విజిలెన్స్ అధికారులు నిఘాని కొంతమేర పెంచారు. చెక్‌పోస్టుల ఏర్పాటులో జాప్యం జరుగుతున్నా మొబైల్ టీంలు అక్రమ రవాణాని అడ్డుకట్ట వేయటానికి తనిఖీలు ప్రారంభించాయి. మరోవైపు రూట్‌కో రేటు నిర్ణయించి ఆయా మార్గాల్లో రవాణా అవుతున్న లారీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ముఠా ఆగడాలు సైతం ఇంకా తగ్గలేదు. దీంతో అటు అధికారులు, ఇటు దందాకు పాల్పడే ముఠా సభ్యుల బారిన పడకుండా తప్పించుకోవటానికి రవాణాదారులు నూతన మార్గాలను వెతుక్కుంటున్నారు. దీనిలో భాగంగా ప్రధాన రహదారుల నుంచి కాకుండా అడ్డదారులను తమ గమ్యమార్గాలుగా ఎంచుకుంటున్నారు. ప్రధానంగా మర్రిచెట్లపాలెం, బూదవాడ, ఆర్‌ఎల్.పురం, చీమకుర్తిల నుంచి గ్రానైట్ శ్లాబులతో రాష్ట్ర పరిధిలోని ప్రాంతాలకు రవాణా అయ్యే లారీలు అడ్డదారిన వెళ్తున్నాయి.

చీమకుర్తి నుంచి పాటిమీదపాలెం, పల్లామల్లి, నేకునంబాదు, దొడ్డవరం..అలా జిల్లా పరిధిని దాటించిన తదుపరి హైవేపైకి ఎక్కి వైజాగ్ వైపు వెళ్తున్నాయి. ఇటీవల కాలంలో వీటి రద్దీ ఎక్కువకావటంతో ఆయా గ్రామాల ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. మరోవైపు రహదారులు సైతం ఛిద్రమవుతున్నాయి. ప్రమాద భరితంగా మారాయి అని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అడ్డదారుల్లో గ్రానైట్ రవాణాకు అధికారులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు జమ

ఒంగోలు(విద్య), అక్టోబరు 10 : ఎట్టకేలకు సమగ్ర శిక్ష ప్రాజెక్టులో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి వారి బ్యాంకు ఖాతాలకు గురువారం జీతాలు జమ అయ్యాయి. గత రెండు నెలలుగా జీతాలు లేక ఆందోళన చెందుతున్న వారికి పండుగ వేళ ఊరట లభించింది. సమగ్రశిక్ష ప్రాజెక్టులో మొత్తం 1,265 మంది పనిచేస్తుండగా వీరిలో ఎమ్మార్సీ కేంద్రాల్లో 161 మంది, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు 139 మంది, సీఆర్పీలు 190 మంది, కేజీబీవీల్లో 700 మంది పనిచేస్తున్నారు. వీరికి ఒక నెల వేతనం చెల్లించేందుకు రూ.3.04 కోట్లు అవసరం. గత ఆగస్టు, సెప్టెంబరు నెలల వేతనాలు చెల్లించకపోవడంతో వీరు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జీతాల కోసం సీఆర్పీలు రోడ్డెక్కి ధర్నా కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సమగ్రశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఆగస్టు, సెప్టెంబరు నెలల జీతాలకు సోమవారం రూ.6 కోట్లు విడుదల చేశారు. గురువారం ఉద్యోగుల బ్యాంకు ఖాతాలకు వేతనాలు జమకావడంతో సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

డీఎంహెచ్‌వోపై తొలగని సందిగ్ధం

మౌఖిక ఆదేశాలతో రత్నావళి నియామకం నిలుపుదల

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 10: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రత్నావళి నియామకంపై సందిగ్ధం తొలగలేదు. నాలుగు రోజులక్రితం డీఎంహెచ్‌వోగా రత్నావళిని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నియామకంపై జిల్లాలోని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడారు. గతంలో ఇక్కడ పనిచేసి అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న రత్నావళిని తిరిగి మరలా ఇక్కడే నియమించడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో రత్నావళికి వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ కార్యాలయంలో మూవ్‌మెంట్ ఆర్డర్ ఇవ్వకుండా నిలిపివేశారు. వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. అయితే శుక్రవారం డీఎంహెచ్‌ఓ నియామకంపై వైద్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడే ప్రయత్నాన్ని కొంత మంది చేశారు. అయితే కేబినెట్ మీటింగ్ అనంతరం ఆయన కూడా హైదరాబాద్ వెళ్లడంతో ఆ ప్రక్రియ కూడా వాయిదా పడింది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ప్రభుత్వ కార్యాలయాలకు దసరా సెలవులు వచ్చాయి. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నియామకం ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

త్వరలో డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజీ రుణాలు

మద్దిపాడు, అక్టోబరు 10 : మండలంలోని డ్వాక్రా సంఘాలకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.28కోట్లు లింకేజ్ రుణాలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.15కోట్లు రుణాలు ఇచ్చినట్లు ఏపీఎం కోటేశ్వరరావు తెలిపారు. గురువారమిక్కడ స్త్రీశక్తి భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిగిలిన రూ.10కోట్ల రుణాలను త్వరలో పంపిణీ చేస్తామన్నారు.

పంచాయతీ బదిలీల

అక్రమార్కులపై వేటు

ముగ్గురిపై క్రిమినల్ కేసు నమోదుకు ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 10: గ్రామపంచాయతీ గ్రేడ్-5, 6 (సచివాలయ ఉద్యోగులు) ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులు జారీలో జరిగిన అక్రమాలపై కలెక్టర్ తమీమ్ అన్సారియా కొరడా ఝుళిపించారు. ఇద్దరిపై సస్పెన్షన్ వేటు పడగా, మరొకరిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు. బదిలీల ఉత్తర్వులు ఇచ్చే విషయంలో జరిగిన పరిణామాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వరుస కథనాలతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావును నియమించారు. ఆయన ఇచ్చిన నివేదిక మేరకు డిజిటల్ అసిస్టెంట్ సాయికోటేశ్వరరావును సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటికే పూర్వ జూనియర్ అసిస్టెంట్ ఎంవీ కిషోర్‌బాబును సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కిషోర్‌బాబు, పి.సాయికోటేశ్వరరావు, పూర్వ పరిపాలనాధికారి ఎస్.శివప్రసాద్‌లపై అవినీతి నిరోధక చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎస్పీ దామోదర్‌కు డీపీవో గొట్టిపాటి వెంకటనాయుడు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీంతో వారి ముగ్గురిపై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

ఉలిక్కిపడిన ఉద్యోగులు

కాగా జిల్లా పంచాయతీ కార్యాలయంలో గత ఐదు రోజుల నుంచి జరుగుతున్న పరిణామాలతో ఇప్పటికే ఆ శాఖ ప్రతిష్ట దిగజారింది. ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో దానిని ఆదాయ వనరుగా మార్చుకొని ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. గ్రేడ్-5, 6 ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించి నెలరోజులు గడిచినా ఆర్డర్లు ఇవ్వలేదు. ఇప్పటికి కూడా నిరంతరం ఉద్యోగులు వాటి కోసం జిల్లా పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఇన్‌చార్జ్ డీపీవో ఉషారాణి పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయింది. అయితే ఆయా ఉద్యోగులపై వేటు నేపథ్యంలో ఇప్పటివరకు బదిలీల ఉత్తర్వులు తీసుకొని కార్యదర్శుల్లో ఆందోళన నెలకొంది.

పృథులగిరిపై రూ.50 లక్షలతో అంతర్గత రహదారి

మద్దిపూడి, అక్టోబరు 10 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి లక్ష్మీనరసింహాస్వామి కొండపై రూ.50లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్ పనులను కందుకూరు పంచాయతీరాజ్ ఈఈ కోటేశ్వరరావు గురువారం పరిశీలించారు. మద్దిపూడి ఘాట్‌రోడ్ వైపు నుంచి దేవాలయం సోపానాల వరకు 170 మీటర్ల రహదారి నిర్మాణానికి రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి రూ.50లక్షలు మంజూరు చేయించారు. ఈరహదారి నిర్మాణం వలన దేవాలయంకు వెళ్లే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది. అంతకు ముందు మద్దిపూడిలో చావిడి వద్ద దాతల సాకారంతో ఏర్పాటు చేయనున్న ముఖద్వారాన్ని పరిశీలించారు. డీఈ శ్రీధర్‌రెడ్డి, ఏఈ జాలయ్య, తెలుగు రైతు నియోజకవర్గ అధికార ప్రతినిధి రేగేల వీరనారాయణ, మండలపరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు హనుమారెడ్డి, నాయకులు ఇనుకొళ్ళు మాదిరెడ్డి ఉన్నారు.

విద్యుత్ సిబ్బంది కొరతతో ఇక్కట్లు

- వర్షం పడితే సరఫరాకు అంతరాయం

కొండపి, అక్టోబరు 10 : మండలంలోని పలు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు తరచూ తీవ్ర అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది కొరత కారణంగా మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా పెట్లూరు, కె.ఉప్పలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఈ సమస్య తరచూ వేధిస్తోంది. మండలంలో 14 సచివాలయాలు ఉండగా, ఎనర్జీ అసిస్టెంట్లు ఏడుగురు మాత్రమే ఉన్నారు. శాఖా పరంగా లైన్‌మెన్‌లు ఇద్దరు, ఒక అసిస్టెంట్ లైన్‌మెన్, పర్యవేక్షణకు లైన్‌ఇన్‌స్పెక్టర్‌లు ఇద్దరు మాత్రమే ఉన్నారు. సిబ్బంది తగినంత మంది లేకపోవడంతో సకాలంలో విద్యుత్ మరమ్మతులు పూర్తికావడం లేదు. కె. ఉప్పలపాడు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో వర్షం పడితే సరే విద్యుత్ సరఫరా నిలిపోతున్నదని, వెన్నూరు, ముప్పవరం, చోడవరం పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వామి, సత్యలకు 13న పౌర సన్మానం

- అదేరోజు నియోజకవర్గ టీడీపీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

కొండపి, అక్టోబరు 10 : కొండపిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలకు పౌర సన్మానం, నియోజకవర్గ స్థాయి టీడీపీ నాయకుల, కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయాలని మండల టీడీపీ నిర్ణయించింది. అందులో భాగంగా గురువారం మధ్యాహ్నం కొండపిలోని పార్టీ కార్యాలయంలో నాయకులు సమావేశమయ్యారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొర్రపాటి వసంతరాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యాచరణ కార్యక్రమంపై నాయకులు సమాలోచనలు చేశారు. కొండపిలో భారీ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పార్టీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ గొర్రెపాటి రాయమ్మ చౌదరి, నాయకులు బత్తుల నారాయణస్వామి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, చాగంరెడ్డి నరసారెడ్డి, బొల్లినేని నరసింహం, మూలె రామారావు, మూలె కోటేశ్వరరావు, కందిమళ్ల లక్ష్మీనారాయణ, కొమ్మాలపాటి రాఘవరావు, రావిపాటి బాలకృష్ణ, చింతల వెంకట్రావు, పోటు శ్రీనివాసరావు, మారెడ్డి సుబ్బారెడ్డి, బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య పాల్గొన్నారు.

పీవీఆర్ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులు ఆటలు


దసరా.. ఆట 'సరదా'..!

- పిల్లలతో కళకళలాడుతున్న క్రీడా మైదానాలు

దసరా సెలవులు పిల్లలకు ఎంతో సరదా తెచ్చింది. తమకు ఇష్టమైన ఆటలు ఆడుకుంటూ సంది చేస్తున్నారు. దీంతో నగరంలోకి పలు పాఠశాలల క్రీడా మైదానాలు కళకళలాడుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి సెలవులకు ఒంగోలులోని తమ బంధువులు ఇళ్ళకు వచ్చిన చిన్నారులు, కాలేజీ విద్యార్థులు ఆటలాడుతూ ఆనందాన్ని పొందుతున్నారు. గత నాలుగైదు రోజులుగా నగరంలోని ఏ క్రీడామైదానం కూడా ఖాళీ లేకుండా పిల్లలు, పెద్దలు క్రికెట్ ఆడుతూ ఆనందగా గడుపుతున్నారు. వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చిన వారు గ్రౌండ్‌లో కలిసిమెలసి ఆడుకోవడంతో స్నేహ సంబంధాలు వెల్లివిరుస్తున్నాయి. కాగా గురువారం ఉదయం నగరంలోని పీవీఆర్ స్కూలు మైదానం ఇలా చిన్నారులతో సందడిగా కనిపించింది.

- ఒంగోలు (కార్పొరేషన్)


వృద్ధురాలు మస్తానమ్మ

వయసు 77.. ఆధార్‌లో 5 ఏళ్లు

- వృద్ధురాలికి ఆగిపోయిన పింఛన్

నాగులుప్పలపాడు అక్టోబరు 10 : ఆమె వయసు 77.. కానీ ఆధార్‌లో మాత్రం 5 సంవత్సరాలుగా నమోదు కావడంతో ఎన్నో ఏళ్ల నుంచి వస్తున్న పింఛను నిలిచిపోయింది. దీంతో ఏ ఆసరా లేని ఒంటరి వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మద్దిరాలపాడు గ్రామానికి చెందిన చెరుకూరి మస్తానమ్మకు కొన్నేళ్ల క్రితం భర్త చనిపోవడంతో వితంతు పింఛను తీసుకొంటూ జీవిస్తుంది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి ప్రభుత్వ పథకాలను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో మస్తానమ్మకు చిక్కులు వచ్చాయి. ఆమె ఆధార్‌కార్డులో వయసు ఐదేళ్లుగా నమోదుకావడంతో పింఛను నిలిపోయింది. ఇప్పుడు ఆధార్‌కార్డులో వయసు మార్చుకునేందుకు వృద్ధాప్యంలో ఉన్న ఆమె చేతివేళ్లు బయోమెట్రిక్ తీసుకోవడం సహకరించడం లేదు. వయోభారంతో ఏ పనిచేయలేక, తనకంటూ ఎవరూ లేక, ప్రభుత్వం నుంచి పింఛను రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఉన్నతాధికారులు స్పందించి తనకు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని మస్తానమ్మ వేడుకుంటున్నారు.

మహాదుర్గగా జగన్మాత



దుర్గాదేవిగా బాలాత్రిపురసుందరీ అమ్మవారు, బేస్తవారపేట, మార్కాపురం, దోర్నాలలో అలంకరణలు

త్రిపురాంతకం, అక్టోబరు 10: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వర క్షేత్రంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారు గురువారం మహాదుర్గా అలంకారణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి, చిన్నమస్తాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మంగళవాయిద్యాల నడుమ నందివాహనంపై ఆలయ ఉత్సవం నిర్వహించారు. అమ్మవారు శుక్రవారం శ్రీసిద్దిదాయని అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

వైభవంగా దుర్గాష్టమి వేడుకలు

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రులలో భాగంగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీమహిషాసుర మర్థినిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రికి దుర్గాష్టమి అలంకరణలతో సాగిన నృత్యాలు అందరినీ అలరించాయి. కెఎస్‌పల్లెలోని పోలేరమ్మతల్లి దేవస్థానంలో దుర్గాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంబాభిషేకం చేశారు. చండీ మహాయాగాన్ని, మహాకుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా షరాఫ్ బజారులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో రాజ్యలక్ష్మీ అమ్మవారు వీరలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. శివాలయంలో జగదాంబ మహిషాసుర మర్ధిని అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వాసవి కాన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మ వారు మహిషాసురమర్ధినిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

పెద్దదోర్నాల : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని తిమ్మాపురంలోని చౌడేశ్వరీ దేవాలయం, మోట్ల మల్లికార్జునపురంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈ వేడుకలకు మహిళలు విశేషంగా హాజరయ్యారు.

దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు

బేస్తవారపేట : బేస్తవారపేటలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీదేవి అమ్మవారు గురువారం శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవాలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బీసీ కాలనీలోని శ్రీచౌడేశ్వరీదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

మహిషాసురమర్ధనిగా దర్శనం

కొమరోలు : వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారు గురువారం శ్రీ మహిషాసూర మర్ధనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పద్మనాభుని నరశింహారావు, మరియాల సత్యనారాయణలు సతీసమేతంగా అమ్మవారికి పూలు పట్టుచీరలను సమర్పించారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సతీ పుష్ప సమావేతంగా అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ అధ్యక్షుడు తుమ్మలపెంట వెంకటరమణ, ఆలయ పూజారి గౌరిపెద్ది హరిశర్మలు, ముందుగా ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. ఎంపీటీసీ మాజీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి సతీమణి హరితమ్మలు అమ్మవారికి పట్టువస్త్రాలు, పూలమాలలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షులు బిజ్జాల తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్రామిరెడ్డి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గజ్జలకొండ నారాయణ, పార్టీనాయకులు, కార్యాకర్తలు పాల్గొన్నారు.

సచివాలయంలో కమిషనర్ తనిఖీ



ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

గిద్దలూరు, అక్టోబరు 10 : పట్టణంలోని నంద్యాల రోడ్డు లోని సచివాలయాన్ని మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు తనిఖీ చేశారు. ఇళ్ల పన్ను వసూలుపై సమీక్ష నిర్వహించారు. బకాయిలను వెంటనే వసూలు చేయాలని, నోడల్ అధికారులు బకాయిదారుల ఇంటికి వెళ్లి పన్నులు వసూలయ్యే విధంగా చూడాలని పేర్కొన్నారు. నీటిపన్ను, ఖాళీస్థలాలపై పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలతో గౌరవంగా మాట్లాడాలని సూచించారు.

అన్న క్యాంటీన్ తనిఖీ

పట్టణంలోని అన్నక్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు తనిఖీ చేశారు. ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మంచినీటి వసతి సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలని, క్యాంటీన్ పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.

పన్నులు విధించని నిర్మాణాలు గుర్తించాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 10: మార్కాపురం పట్టణ పరిధిలోని పన్నులు విధించని భవనాలు, నిర్మాణాలు గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు సూచించారు. స్థానిక మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో గురువారం వార్డు అడ్మిన్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ అసైన్డ్, అండర్ అసైన్డ్ భవనాలు గుర్తించి పన్నుల పరిధిలోకి తీసుకురావాలన్నారు. పన్నులు వేయని భవనాలు, అదనపు నిర్మాణాలకు పన్నులు విధించుకోదలచిన వారు సంబంధించిన డాకుమెంట్‌లు ఆధార్‌కార్డు, తదితర ధృవ పత్రాలు సచివాలయాలలోని అడ్మిన్ సెక్రటరీలకు అందజేయాలని తెలిపారు. వివరాల కోసం సంబంధిత వార్డు సచివాలయాలు, మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగంలో సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్‌వో పఠాన్ అబ్దుల్ ఖాన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు డ్వాక్రా మహిళల సాయం

పొదిలి, అక్టోబరు 10 : ఇటీవల విజయవాడలో వరద కారణంగా ఇబ్బందులకు గురైన బాధితులకోసం పొదిలి మండలం వెలుగు డీఆర్‌డీఏ పరిధిలోని డ్వాక్రా మహిళలు వసూలు చేసిన రూ.1,01250 విలువైన చెక్కును మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డికి గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కో-ఆర్డీనేటర్ సుధాకర్, ఏపీఎం గోపాలకృష్ణ, సీసీలు రాజయ్య, వెంకటరెడ్డి, టీడీపీ నాయకులు నజ్మ, మెహరున్నీసా, బుచ్చిబాబు తదితరులున్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

కలెక్టర్ తమీమ్ అన్సారియా



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఎర్రగొండపాలెం (పుల్లలచెరువు), అక్టోబరు 10: చెంచుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ప్రభుత్వ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం ఎర్రగొండపాలెం మండలంలో ఆమె విస్తృతంగా పర్యటించారు. మండలంలోని గంజివారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లిపాలెం గిరిజనులు చెంచుగూడేంలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె సార్డ్ ఆధ్వర్యంలో రూ.26 లక్షలతో నిర్మించిన బాల ప్రకాశ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత చెంచుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు సార్డ్ సంస్థ కృషి చేయడం అభినందనీయమన్నారు. గిరిజనులకు అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జన్‌మన్ కార్యక్రమం ద్వారా అనేక సంక్షేమ పథకాలు చేపట్టాయన్నారు. అల్లిపాలెం చెంచుగూడేంలో ఇళ్లు నిర్మించాలని, రోడ్డుబాగు చేయించాలని, వసతిగృహం నిర్మించాలని స్థానికులు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. అదేవిధంగా 40 కుటుంబాలకు అంతోద్యయ రేషన్ కార్డులు, కమ్యూనిటీ హెల్త్ సెంటరు, సార్డ్ నిర్మించిన భవనానికి కంపౌండ్ వాల్ నిర్మించాలని స్థానికులు కోరారు. అనంతరం ఆమె కుడుముల భయన్న ఇంటిని సందర్శించారు. భయన్న మాట్లాడుతూ తనకు పక్కా గృహం నిర్మించాలని, తమ పిల్లలు చదువుకోనేందుకు వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అందులో వున్న చిన్నారులకు 15 మంది విద్యార్థులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో వీరికి పౌష్ఠికాహారం అందడంలేదని తెలుపగా వెంటనే ఆధార్ క్యాంపు పెట్టి ఆధార్‌కార్డులు నమోదు చేయాలని ఆదేశించారు.

వైద్యశాలను సందర్శించిన కలెక్టర్

ఎర్రగొండపాలెంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. అనంతరం పుల్లలచెరువు రోడ్డులో నిర్మించిన రైతుబజారును పరిశీలించారు. కార్యక్రమంలో మార్కపురం సబ్ కలెక్టరు సహదీత్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ బాలకిషోర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ ఉపేంద్ర కుమార్, సార్డ్ పీడీ సునీల్ కుమార్, వైద్యశాలసూపర్‌డెంట్ యాదీద్యా అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ముత్తుముల నివాళి



నివాళి అర్పిస్తున్న అశోక్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి

గిద్దలూరు టౌన్, అక్టోబరు 10 : అర్థవీడు తహసీల్దార్ కె.దాసు (55) గుండెపోటుతో బుధవారం మృతిచెందగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి ఆయన స్వగ్రామం వెళ్లి నివాళ్లు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సాన భూతి వ్యక్తం చేశారు. అర్థవీడు తహసీల్దార్‌గా ఇటీవల బదిలీపై వచ్చి విధులు నిర్వహిస్తున్న దాసు మాచర్ల నుండి విధులు నిర్వహించేందుకు అర్ధవీడు వస్తుండగా గుండెపోటుకు గురై మృతిచెందారు. తహసీల్దార్ మృత్యువార్త తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గురువారం తహసీల్దార్ స్వగ్రామమైన రాచమల్లుకు వెళ్లాడు. స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితోపాటు నివాళ్లు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

మద్యం దుకాణాల కోసం స్వేచ్ఛగా దరఖాస్తు చేసుకోండి

ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ బాలయ్య

మార్కాపురం, అక్టోబరు 10: మద్యం దుకాణాలకు నిర్భయంగా దరఖాస్తులు చేసుకోవాలని మార్కాపురం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.బాలయ్య అన్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ అనుకున్న మేరకు దరఖాస్తులు దాఖలు కాకపోవడంతో ప్రభుత్వం రెండు రోజుల పాటు గడువు పొడిగించిందన్నారు. చాలావరకు దుకాణాలకు 10 లోపు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిపై కూడా ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. ఆయా ప్రాంతాల్లో డిమాండ్ ఉండి తక్కువ దరఖాస్తులు వచ్చేవాటికి అవసరమైతే మళ్లీ రీ టెండర్లు పిలుస్తుందన్నారు. సిండికేట్‌లను నిరోధించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం నూతన మద్యం పాలసీ విధానం ద్వారా నాణ్యమైన మద్యం సరఫరా చేస్తుందన్నారు. అంతేకాక లైసెన్స్‌దారులకు కూడా 20 శాతం మేర ఆదాయం సమకూరనుందన్నారు. ఆసక్తి వున్న వాళ్లు అపోహలు వీడి దుకాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి, స్క్వాడ్ సీఐ గౌస్‌బాషలు పాల్గొన్నారు.

పొదిలి : రాజకీయలకు అతీతంగా మద్యం టెండర్లు నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్ విజయ అన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. టెండర్ల విషయంలో సందేహాలు, ఇబ్బందులపై ఆరాతీశారు. ఎలాంటి అవకతవకలు లేకుండా మద్యం పాలసీని విజయవంత చేసేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. టెండర్‌దారుల్లో రాజకీయ ఒత్తిళ్లు ఉంటాయనే అపోహలు ఉన్నాయని వాటిని నమ్మవద్దని ఆమె భరోసా ఇచ్చారు. కొత్త మద్యం విధానం వచ్చిన తరువాత బెల్ట్‌షాపులు, నాటుసారా విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఏ జనార్ధన్‌రావ్, సీఐలు నరహరి, రామారావ్, అరుణకుమారి, ఎస్ఐ సైమన్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● ఇరువురికి గాయాలు



వివరాలు సేకరిస్తున్న పోలీసులు

గిద్దలూరు టౌన్ : వేగంగా వస్తున్న వాహనం మోటార్ సైకిల్‌ను ఢీ కొనడంతో ఒకరు మృతిచెందగా ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాచర్ల మండలం సంగపేటకు చెందిన వెంకటేశ్వర్లు ద్విచక్రవానంపై తన స్నేహితులు అంజనేయులు, గురవయ్యతో పాటు కలిసి గిద్దలూరు వస్తున్నాడు. గిద్దలూరు వద్ద జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనం వీరి ద్విచక్ర వాహన్ని ఢీకొట్టింది. దీంతో దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న వెంకటేశ్వర్లు(41) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అంజనేయులును నర్సరావుపేటకు, గురవయ్యను నంద్యాలకు తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి

కొమరోలు, అక్టోబరు 10: మండలంలోని కసినెపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కొండాయిపల్లి రాంప్రసాదు అనే ఉపాధ్యాయుడిపై దాడి చేసిన ఘటన మండలంలోని కే.బొంతపల్లి వ్యవసాయ పొలాల్లో చోటుచేసుకొంది. పోలీసుల వివరాల ప్రకారం మండలంలోని అల్లీనగరం గ్రామానికి చెందిన రాంప్రసాదు కసినెపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. రాంప్రసాదు డిప్యూటేషన్‌పై కే.బొంతపల్లిలో పనిచేసే సమయంలో మజ్జారి శ్రీనివాసులు కుటుంబంతో పరిచయం ఏర్పడింది. దీంతో శ్రీనివాసులును రాంప్రసాద్ తనకు మేకలు కావాలని కొనిపెట్టమని కోరాడు. ఈ మేరకు రాంప్రసాదును బొంతపల్లి పొలాల్లో మేకలు ఉన్నాయని చెప్పి శ్రీనివాసులు తీసుకొని వెళ్లాడు. అక్కడ తన పరిచయస్థుడు రవిలు కర్రలతో గాయపరిచాడు. రక్తపు మరకలతో కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి కాపాడారు. దీంతో విషయాన్ని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా మరోవైపు దాడిచేసిన మజ్జారి శ్రీనివాసులు కుమార్తె మజ్జారి రక్షిత రాంప్రసాద్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్ని నెలలుగా ఉపాధ్యాయుడు రాంప్రసాదు వేధిస్తున్నారని, వారి నుంచి తనను రక్షించాలని మరో ఫిర్యాదును మజ్జారి రక్షిత ఇచ్చారు. ఈ మేరకు ఇరువురి ఫిర్యాదులపై కేసులు నమోదుచేసి విచారిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

దర్శి, అక్టోబరు 10: మండలంలో శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం స్థానిక కన కదుర్గమ్మ గుడి, పోలేరమ్మ గుడి, దాద్దాలమ్మ గుడి, వెంకటేశ్వర స్వామి గుడిలో దుర్గాదేవిగా అమ్మవార్లు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని పొంగళ్ల నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

దొనకొండలో.. దొనకొండ, అక్టోబరు 10: స్థానిక ఆనంద ఆశ్రమంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీఈశ్వరాంబ అమ్మవారు కనకదుర్గమ్మ దేవిగా భక్తులకు దర్శన మిచ్చారు. ఈసందర్భంగా పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శత నామవాళి కుంకుమ పూజలు చేసి ధూప దీప నైవేద్యాలు స మర్పించారు. సామూహిక హారతులు ఇచ్చారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పామూరులో.. పామూరు అక్టోబరు, 10: దసరా నవరాత్రుల వేడుకల్లో భాగంగా ఎనిమిదవ రోజు గురువారం స్థానిక కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహిషాసురమర్ధినిగా ప్రత్యేక అలంకరణ చేయగా.. భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, అక్టోబరు 10: తాళ్లూరులోని రామలింగేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, కన్యకాపరమేశ్వరి, తూర్పుగంగవరం వాసవీమాత, గంగాభవానీ దేవాలయాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 8వరోజు గురువారం దుర్గాదేవి, శ్రీమహిషాసురమర్దనిగా అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పీసీపల్లిలో.. పీసీపల్లి, అక్టోబరు 10: మండలంలోని పెదయిర్లపాడు మల్లేశ్వరస్వామి ఆలయంలో గురువారం దుర్గాదేవీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా దుర్గాసప్తపతి, దుర్గాదేవి షోడశోపచార పూజ, అష్టోత్తర పూజ, లలితసహస్రనామ పూజలుచేశారు. అనంతరం అమ్మ వారికి మహిళలు కుంకుమార్చన పూజలు చేశారు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



తాళ్లూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా అమ్మవారు

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయాలి

కనిగిరి, అక్టోబరు 10: వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక దర్శి చెంచయ్య భవనంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు పరిధిలో 11 ముంపు ప్రాంత గ్రామాలకు ఆర్అర్ ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుకు నికరజలాలు కేటాయించాలని కోరుతూ నవంబరు 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్టు చెప్పారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లయిన సందర్భంగా మండల, నియోజకవర్గాలలో జెండాలను ఆవిష్కరించాలని కోరారు. ఈసందర్భంగా డిసెంబర్ 26న ఒంగోలులో జరిగే సభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు వై.రవీంద్రబాబు, రామారావు, ఎస్‌డీ మౌలాలి, యాసిన్, మోహన్, గుజ్జుల బాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డ్రైవింగ్ శిక్షణ కేంద్రం పనులు ప్రారంభం

దర్శి, అక్టోబరు 10 : దర్శిలో మధ్యలో నిలిచిపోయిన జాతీయ స్థాయి డ్రైవింగ్ శిక్షణ, పరిశోధనా కేంద్రం నిర్మాణ పనులను మూడు నెలల్లో పునఃప్రారంభిస్తామని రవాణా, క్రీడా శాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గురువారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా నిలిచిపోయిన వివిధ పనులను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని వైసీపీ పాలకులు మూలనపడేసి విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డాక్టర్ లక్ష్మి గురువారం డ్రైవింగ్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరగా, టెండర్లు పిలిచి మూడు నెలల్లో ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు. అలాగే క్రీడా ప్రాంగణాల పునఃనిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు లక్ష్మి తెలిపారు.

రోడ్డు కోసం వడ్డెపాలెం గ్రామస్థుల ఆందోళన

పీసీపల్లి, అక్టోబరు 10: గత వైసీపీ ప్రభుత్వం తమ ఊరికి రోడ్డు వేయకుండా ఇబ్బందులకు గురిచేసిందని మండలంలోని వడ్డెపాలెంకు చెందిన ప్రజలు గురువారం రోడ్డుపై రాళ్లు ఏరుతూ ఆందోళన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో అలవలపాడు నుంచి వడ్డెపాలెంకు తారురోడ్డు మంజూరైంది. అప్పట్లో రోడ్డుపై కంకర కూడా పరిచారు. ఇంతలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. గత ఐదేళ్లు రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో రోడ్డుపై పరిచిన కంకరరాళ్లు వాహనాల రాకపోకల సమయంలో ఎగిరివచ్చి రోడ్డుపై వెళ్తున్న వారిని తగలడంతో గాయపడిన సందర్భాలు ఉన్నాయి. పలువురు ద్విచక్ర వాహనదారులు రోడుపై ప్రయాణిస్తూ జారిపడి గాయపడిన సం ఘటనలు కూడా ఉన్నాయి. గురువారం వడ్డెపాలెం గ్రామానికి చెందిన యువకులు రోడ్డుపై ఉన్న కంకరరాళ్లను ఏరుతూ నిరసన చేపట్టారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వడ్డెపాలెంకు తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

దొనకొండ, అక్టోబరు 10: దొనకొండ ఆర్సీఎం ఉన్నత పాఠశాలలో 2011-12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు దాదాపు 35మంది గురువారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన ఈకార్యక్రమంలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించు కుంటూ, కుటుంబసభ్యుల బాగోగులు తెలుసుకుంటూ, చదువుకున్న రోజుల్లో జ్ఞాపకాలను నెమరేసుకుంటూ పరవశించిపోయారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులైన వై.అంతోనిదాస్, వరికూటి వెంకటేశ్వర్లు, డి.లిల్లీసు చరితాదేవి, ఎం.క్లమెంట్‌లను సన్మానించారు.

నాంచారపురంలో వైద్య శిబిరం

కురిచేడు, అక్టోబరు 10: మండలంలోని నాంచారపురం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. మంచం పట్టిన నాంచారపురం శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఉదయాన్నే వైద్య సిబ్బంది నాంచారపురం గ్రామానికి వెళ్ళి వైద్యశిబిరం ఏర్పాటుచేశారు. పంచాయతీ కార్యదర్శి మధుబాబు సర్పంచ్‌తో కలసి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది నాంచారపురం గ్రామానికి వెళ్ళి వైద్య శిబిరం, పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను కందుకూరు ఆర్డీవోకు తహసీల్దార్ రజనీకుమారి ద్వారా పంపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ప్రవీణ్, రవితేజకుమార్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం అభివృద్ధికి అధికారులు కృషిచేయాలి

సీఎస్‌పురం(పామూరు), అక్టోబరు 10: సీఎస్‌పురం మండల అభివృద్ధికి అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంగా వ్యవహరించి అభివృద్ధికి దోహదపడాలని ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఖాదర్‌బీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.




ఆస్ట్రేలియా నుంచి దరఖాస్తు




- సంతమాగులూరులో ఓ వైన్స్ కోసం
- జిల్లాలో ఇప్పటి వరకు 1445 దరఖాస్తులు
- పర్చూరు పరిధిలో నమోదైన అత్యధిక సగటు

బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మద్యం పాలసీ మార్చి ప్రైవేటు వ్యక్తులకు వైన్స్ బాధ్యతలు అప్పగిస్తోంది. ఈ క్రమంలో వ్యాపారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా జిల్లా పరిధిలోని సంతమాగులూరు మండలంలో ఓ మద్యం దుకాణానికి ఆస్ట్రేలియా నుంచి దరఖాస్తు అందింది. నేతల బెదిరింపులు, వ్యాపారుల సిండికేట్ కారణంగా తక్కువగా దరఖాస్తులు రావడంతో గడువును ప్రభుత్వం పెంచడంతో గురువారం ఆశావహుల నుంచి భారీగానే స్పందన వచ్చింది. దీంతో జిల్లా వ్యాప్తంగా దరఖాస్తుల సంఖ్య 1445కు చేరినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు తెలిపారు. విదేశాల నుంచి కూడా స్పందన ఉందని గడువు ముగిశాక పరిశీలనలో ఇలా వచ్చిన దరఖాస్తుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. షాపుల వారీగా దాఖలైన దరఖాస్తుల సంఖ్య సగటు విషయంలో అత్యధికంగా పర్చూరు నియోజకవర్గ పరిధిలో షాపుకు 20 వరకు వచ్చాయి. అత్యల్ప సగటు రేపల్లె రూరల్‌తో పాటు చుండూరు, కొల్లూరు, భట్టిప్రోలు, సంతమాగులూరు మండలాల్లో నమోదయ్యాయి. ఇక్కడ ఒక్కో షాపుకు వచ్చిన సగటు దరఖాస్తుల సంఖ్య 4కు మించకపోవడం సిండికేట్ ఆరోపణలకు బలం చేకూర్చేవిగా ఉన్నాయి. దరఖాస్తుల సమర్పణకు గడువు శుక్రవారంతో ముగియనున్నది. అత్యధికంగా ఇంకొల్లు మండల పరిధిలోని 3 షాపులకు 121 రాగా, మార్టూరు పరిధిలో 6 దుకాణాలకు 147 దరఖాస్తులు వచ్చాయి. పర్చూరు నియోజకవర్గ పరిధిలోని 20 షాపులకు 410 దరఖాస్తులు రావడంతో ఇక్కడ 20 సగటు నమోదైంది. రేపల్లె రూరల్ పరిధిలోని 4 షాపులకు 16 దరఖాస్తులు రాగా, చుండూరు 3కు 14, కొల్లూరు 4కు 18, భట్టిప్రోలు 5కు 30, సంతమాగులూరు మండల పరిధిలో 5 షాపులకు 21 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకు ఆయా షాపులకు వచ్చిన దరఖాస్తులను బేరీజు వేసుకుని చివరిరోజు పోటీ తక్కువగా ఉన్న దుకాణాలపై ఆశావహులు దృష్టి సారించే అవకాశాలు కనబడుతున్నాయి. సిండికేట్ల విషయంలో నేతలపై వస్తున్న ఆరోపణలకు ఆయా పార్టీల అధిష్ఠానాలు ఆగ్రహం వ్యక్తం చేయడంతో గడచిన మూడు రోజుల్లో గణనీయ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. తొలుత కొన్ని షాపుల విషయంలో వేరే వారెవరూ దరఖాస్తు చేయొద్దని లీకులను నేతల అనుచరగణం వదిలింది. వీటిపై అటు అధినేతలు కన్నెర్ర చేయడంతో అలాంటి వారు దాదాపుగా వెనక్కి తగ్గారు. మరోవైపు ఆశావహులకు భరోసా కల్పించే చర్యలను ఎక్సైజ్ శాఖ చేపట్టడంతో చెప్పుకోదగ్గ స్థాయిలోనే దరఖాస్తులు వచ్చాయి.



జీతాల.. పంచాయితీ

- ఐదు నెలలుగా వేతనాల్లేని గ్రేడ్-5 కార్యదర్శులు
- తప్పుల తడకగా కేడర్ స్ట్రెన్త్‌తోనే జీతాల సమస్య
- ఎంపీడీవోలు, డీపీవోలు స్పందించడం లేదంటున్న ఉద్యోగులు
- ప్రభుత్వం మారినా తమ తలరాత మారకపోవడంపై ఆవేదన



బాపట్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా కొంతమంది గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి తయారైంది. కూటమి ప్రభుత్వం రాకతో ప్రభుత్వ ఉద్యోగులందరికీ ఠంచనుగా జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్లు పడుతున్నా వీరికి మాత్రం ఐదు నెలలుగా జీతాలు లేవు. దీంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే 'ఒక పంచాయతీకి ఒక కార్యదర్శి' విధానాన్ని అమలులోకి తెచ్చింది. అందులో భాగంగా పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5లకు పూర్తి స్థాయి పాలనా బాధ్యతలు అప్పగించింది. దానికి సంబంధించి గత ప్రభుత్వమే జీవో 11 ఇచ్చినా, అమలు చేయకుండా గాలికి వదిలేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రేడ్-5 కార్యదర్శులకు పంచాయతీలను కేటాయించడంతోపాటు పంచాయతీ విధులు నిర్వహిస్తున్న గ్రేడ్-5 కార్యదర్శులకి డ్రాయింగ్ అధికారాలు కల్పించేందుకు పూనుకుంది. అప్పటి వరకూ సచివాలయం డీడీవో లాగిన్‌లో జీతాలు పొందుతున్న గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు ఇకపై పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోకి బదిలీ కావాలి. అయితే ఈ బదిలీ వ్యవహారంతోనే సమస్య తలెత్తింది. పంచాయతీ రాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు అన్ని జిల్లాల్లో కలెక్టర్లు గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో అధికారాలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ప్రకారం గ్రేడ్-5 కార్యదర్శుల పోస్టును సచివాలయం నుంచి తొలగించి ఎంపీడీవో కేడర్ స్ట్రెన్త్‌లోకి మ్యాప్ చేసి వారికి ఎంపీడీవో లాగిన్‌లో జీతాలు ఇవ్వాలి. అయితే గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవో లాగిన్‌లో 080 హెడ్ కింద జీతాలు పొందుతున్నారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు మాత్రం 053 హెడ్‌ని ఎంపీడీవో లాగిన్‌లోకి తీసుకొచ్చి ఆ హెడ్ కింద వేతనాల బిల్లులు పెడుతున్నారు. ఇలా రెండు హెడ్‌ల కింద జీతాలు పెట్టడం వల్ల సమస్య తలెత్తి పలువురు గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శుల పాలిట శాపంగా మారింది.

అధికారుల బాధ్యతా రాహిత్యం

'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' విధానంతో 500 కంటే పైగా జనాభా ఉన్న పంచాయతీల సంఖ్యకు సమానంగా కార్యదర్శులు ఉండాలి. గతంలో క్లస్టర్ విధానం అమలులో ఉన్న కారణంగా రెండు మూడు పంచాయతీలకు ఒక కార్యదర్శి ఉండేవారు. ఆ కారణంగా ఒక ఎంపీడీవో పరిధిలో ఐదారుగురు కార్యదర్శులే ఉండేవారు. ఇప్పుడు 'ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి' విధానం కారణంగా అన్ని గ్రామ పంచాయతీలకు కార్యదర్శులు ఉండాలి. ఒక వేళ ఆ సంఖ్య తక్కువగా ఉంటే పెంచమని డీపీవోకి ఎంపీడీవో లేఖ రాసి తగిన సంఖ్యలో కేడర్‌ను సమకూర్చుకోవాలి. అలా పెరిగిన కార్యదర్శులను ఎంపీడీవో లాగిన్‌లో అప్‌డేట్ చేయాలి. అలా సరిచేసే క్రమంలో జరిగిన మార్పు చేర్పులను ఉన్నతాధికారులు రాష్ట్ర ఖజానా అధికారుల దృష్టికి తీసుకు వెళితే వారు డీవోపీపీలో అప్‌డేట్ చేస్తారు. కానీ కొన్ని జిల్లాల్లో ఎంపీడీవోలు కేడర్ స్ట్రెన్త్ సమస్యను తప్పుల తడకగా జిల్లా పంచాయతీ కార్యాలయానికి పంపించారు. మరికొన్ని జిల్లాల్లో ఎంపీడీవో కార్యాలయం నుంచి సరైన డేటా పంపినా బాధ్యతారాహితంగా డీపీవో కార్యాలయ అధికారులు తప్పుల తడకగా పంచాయతీరాజ్ కమిషనర్‌కు సమాచారం పంపారు. ఆ సమాచారాన్నే కమిషనరేట్ అధికారులు రాష్ట్ర ఖజానా కార్యాలయ అధికారులు జిల్లా, ఉప ఖజానా అధికారులకు పంపించారు. ఈ తప్పుడు సమాచారం కారణంగా చాలా మంది గ్రేడ్- 5 కార్యదర్శులు ఐదు నెలలుగా జీతాలు పొందలేక అల్లాడుతున్నారు. తమ పరిధిలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఐదు నెలలుగా జీతాలు రాక అగచాట్లు పడుతున్నా ఎంపీడీవోలు, డీపీవోలు కనీసమాత్రంగా కూడా స్పందించడం లేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. చాలా చోట్ల ఎంపీడీవోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటే, కొన్ని చోట్ల ఎంపీడీవోలు సకాలంలో స్పందించి తప్పులను సరిచేసి నివేదిక పంపించినా డీపీవోలు పట్టించుకోకుండా వదిలేశారు. దీంతో సమస్య పీట ముడిలా తయారైంది. ఐదు నెలలుగా జీతాలు రాని పంచాయతీ కార్యదర్శులు తమకు న్యాయం చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను వేడుకుంటున్నారు.

జయ జయ.. దుర్గా



బాపట్ల: పోలేరమ్మతల్లి దేవాలయంలో శ్రీదుర్గాదేవిగా అమ్మవారు



చుండూరులో దుర్గాదేవి అలంకారం



వేమూరు: జంపని రామేశ్వరాలయంలో విజయదుర్గాదేవి అలంకారం

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జిల్లావ్యాప్తంగా కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి. పలు దేవాల యాల్లో అమ్మవారు శ్రీదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఆలయాల్లో పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

- బాపట్ల

గ్రాడ్యుయేట్‌లు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్

బాపట్ల, అక్టోబరు 10 : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్ కోరారు. బాపట్ల జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. తొలుత యూటీఎఫ్, ఎస్‌టీఎఫ్ఐ సీనియర్ నాయకులు నాగటి నారాయణ వర్ధంతి సందర్భంగా ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు. కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమానికి ఎన్నికల కమిషన్ అవకాశం ఇచ్చిందన్నారు. డిగ్రీ లేదా, డిప్లమో పొందిన వారంతా ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చు అని తెలియజేశారు. నవంబరు 6వ తేదీలోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.వినయ్‌కుమార్, అడుగుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బి.బిక్షాలుబాబు, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, జిల్లా నాయకులు పి.రామాంజనేయులు, సీహెచ్ చెంచయ్య, భవనం శ్రీనివాసరెడ్డి, మద్దాల సురేష్, పాలేరు సురేష్, బి.వినోద్‌కుమార్, కుర్రా రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు జీవనోపాధి కల్పించాలి

- కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, అక్టోబరు 10: పేద మహిళలకు జీవనోపాధి కల్పించి వారిని లక్షాధికారులుగా చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పేద మహిళల జీవనభృతి, ఆర్థిక ఎదుగుదలపై అనుబంధశాఖల అధికారులతో క్యాంప్ కార్యాలయంలో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మహిళలను లక్షాధికారులుగా చేయాలనే కేంద్రప్రభుత్వం ఉద్దేశాన్ని పక్కాగా అమలు చేయాలని తెలిపారు. పీఎంఈజీపీ పథకం కింద జిల్లాలో 135 యూనిట్లు స్థాపించాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 66 యూనిట్లు మంజూరు కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పీఎంఎఫ్ఎంఈ కింద 4,500 యూనిట్లు స్థాపించడానికి కేంద్ర అనుమతులు ఇచ్చిందన్నారు. మహిళలను లక్షాధికారులను చేసే కార్యక్రమాలలో బ్యాంకర్లు ప్రధానపాత్ర పోషించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు పద్మజ, విజయలక్ష్మి, ఎల్‌డీఎమ్ శివకృష్ణ, ఉద్యానశాఖ ఏడీ జె.జెన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు రెండు మిల్లుల గుర్తింపు

- 15 నుంచి సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్

బాపట్ల, అక్టోబరు 10: జిల్లాలో రెండు జిన్నింగ్ మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా గుర్తించినట్లు జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో పత్తి సాగు చేసిన రైతుల నుంచి సీసీఐ ద్వారా కొనుగోలుకు కేంద్రం నిర్ణయించినట్లు తెలిపారు. నోటిఫైడ్ చేసిన జిన్నింగ్ మిల్లుల నుంచి సీసీఐ పత్తి కొనుగోలు చేస్తుందన్నారు. కనీస మద్దతు ధర మీడియం రకం క్వింటాల్ రూ.7,121, లాంగ్ క్వాలిటీ రూ.7,521గా కేంద్రం నిర్ణయించిందన్నారు. పత్తి విక్రయించే రైతులు ఈ నెల 15 నుంచి రైతు సేవా కేంద్రం ద్వారా సీఎం యాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా, రేషన్ కార్డు జిరాక్స్‌లను నమోదు సమయంలో ఇవ్వాలన్నారు. రైతులు పత్తిని బాగా ఆరబెట్టి గోతాలు, బోరాల్లో కాకుండా వదులుగా పత్తిని తీసుకురావాలన్నారు. రైతులు మార్కెట్‌యార్డుకు రావాలా లేదా ఏ జిన్నింగ్ మిల్లుకు రావాలనేది వీఏఏ ద్వారా లేదా నమోదు సమయంలో తెలియజేస్తారన్నారు. సెల్‌ఫోన్‌కు వివరాలు వస్తాయన్నారు. వివరాలకు పర్చూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యదర్శులను సంప్రదించాలన్నారు.

పల్లె పండుగకు ప్రణాళిక సిద్ధం

- నివేదిక సమర్పించిన పంచాయతీ కార్యదర్శులు

బాపట్ల, అక్టోబరు 10: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే పల్లెపండుగ వారోత్సవాలకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకరరావు ఆదేశాల మేరకు జిల్లాలోని 459 పంచాయతీ కార్యదర్శులు పల్లెపండుగకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లాపంచాయతీ అధికారి కార్యాలయానికి ఆయా కార్యదర్శులు పల్లెపండుగ నివేదికతో వచ్చారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్స్ మొత్తం కలిపి అందులో 30 నుంచి 50 శాతం నిధులతో నిర్మాణాత్మక పనులు చేపట్టాలని నిర్ణయించారు. గుర్తించిన పనులను పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేసి సదరు నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి సమర్పించనున్నారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా గ్రామాల కార్యదర్శులతో డీపీవో కార్యాలయం కిటకిటలాడింది. నిర్దిష్టమైన కార్యాచరణ ప్రకారం ప్రాధాన్యతకు అనుగుణంగా ఆయా పనులు చేపట్టి విజయవంతంగా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.



డీపీవో కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శులు

దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి నిర్ణయం హర్షణీయం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 10: దేవాలయాల వైదిక విషయాలలో స్వయం ప్రతిపత్తి కల్పించిన సీఎం చంద్రబాబుకు బాపట్ల జిల్లా అర్చక సేవాసంఘం ప్రధాన కార్యదర్శి బృందావనం గోపిచంద్ అర్చకులతో కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గోపిచంద్ మాట్లాడుతూ దేవాలయాల ఆగమ, వైదిక సంబంధిత విషయాలకు ఎటువంటి రాజకీయ, అధికారుల ఆజమాయిషీ ఉండకూడదని, వైదిక సంబంధిత విషయాలలో ఆగమ పండితులు, అర్చకులకు మాత్రమే నిర్ణయాధికారం ఇవ్వటం, హైందవ సాంప్రదాయలను గౌరవించటంపై హర్షం వ్యక్తం చేశారు.

నిధుల గోల్‌మాల్‌పై ఐసీఐసీఐ బ్యాంకులో సీఐడీ విచారణ ప్రారంభం

72 మంది బాధితులు
రూ.28కోట్లు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా

చిలకలూరిపేట, అక్టోబరు 10: చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో పెద్ద ఎత్తున నగదు, బంగారం గోల్‌మాల్ చేసిన సంఘటనకు సంబంధించి సీఐడీ అధికారులు గురువారం ఇక్కడ విచారణ ప్రారంభించారు. గుంటూరు నుంచి ఒక అడిషనల్ ఎస్పీ, సీఐ, ఎస్ఐలతో కూడిన సీఐడీ ప్రత్యేక బృందం ఇక్కడకు వచ్చింది. బ్యాంకు బ్రాంచిలోని రికార్డులను సీఐడీ అధికారులు పరిశీలించారు. బ్యాంకు అధికారులతో వారు మాట్లాడి అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. నగదు, బంగారం పోగొట్టుకున్న బాధితులు ఇచ్చిన ఫిర్యాదులను వారు పరిశీలించారు. ఈ భారీ కుంభకోణంలో ఎవరెవరి పాత్ర ఏమిటో అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న సీఐడీ అడిషనల్ ఎస్పీ సీహెచ్ ఆదినారాయణ తెలిపిన వివరాల ప్రకారం మొత్తం 72మంది బాధితులు బ్యాంకులో తమ ఫిర్యాదులు అందచేశారు. బాధితులు రూ.28కోట్ల మేరకు డబ్బు, బంగారం కోల్పోయినట్లుగా ప్రాథమిక అంచనాగా ఉందని తెలిపారు. బ్యాంకు మేనేజర్‌గా వ్యవహరించిన నరేష్ మరో ఇద్దరితో కలిసి ఈ కుంభకోణం జరిపినట్టుగా ఆయన చెప్పారు. ఈ ఏడాది జూలైలో ఒక బ్యాంకు లావాదేవీకి సంబంధించిన విషయంలో ఆయనపై తొలుత అనుమానం వచ్చిందని, తరువాత విజయవాడ భారతినగర్ బ్రాంచ్‌లో కూడా మరొక వ్యవహారంలో అతని పాత్ర బయటపడిందని అన్నారు. దీనితో మేనేజర్ నరేష్‌ను తొలుత సస్పెండ్ చేశారు. అనంతరం ఉద్యోగం నుంచి తొలగించారు. ఇతడు చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ భారతి నగర్ బ్రాంచిలలో మేనేజర్‌గా పనిచేసి మోసపూరిత వ్యవహారాలు చేసినట్లుగా వెల్లడైందన్నారు. బ్యాంకు జోనల్ మేనేజర్ దినేష్ మెహ్రా ఈ నెల 8వ తేదీన విజయవాడలో సీఐడీకి మొత్తం కుంభకోణంపై ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును దర్యాప్తుకోసం గుంటూరు సీఐడీ ఆఫీసుకు పంపారు. బ్యాంకు కూడా అంతర్గతంగా ఈ మొత్తం వ్యవహారంపై విచారణ చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. తమ దర్యాప్తు 10రోజులలో ఒక కొలిక్కి వస్తుందన్నారు. బ్యాంకు దర్యాప్తు తమ దర్యాప్తు బేరీజు వేసుకొని ఈ మొత్తం వ్యవహారంపై ఒక నిర్ధారణకు వస్తామన్నారు. 2021 నుంచి ఈ తతంగం జరుగుతున్నదని, అప్పటినుంచి బ్యాంకులో పనిచేసిన సిబ్బంది వివరాలు తమకు ఇవ్వాలని బ్యాంకుకు నోటీసు జారీ చేసినట్లుగా ఆయన వెల్లడించారు. ఈ నెల 3 వ తేదీన తొలుత ఈ కుంభకోణం ఇక్కడ వెలుగులోకి వచ్చిందని, బ్యాంకు అధికారులు అప్రమత్తమై లోతుగా వ్యవహారాలను పరిశీలిస్తున్నారని ఆయన చెప్పారు. తనతో పాటు సీఐడీ సీఐ సంజీవ్ కుమార్, సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట నిరసన

కాగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బ్యాంకు ఎదుట గురువారం కార్యకర్తలు నిరసన తెలిపారు. బాధితులకు సత్వరం న్యాయంచేయాలని వారు నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దర్యాప్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి కబడ్డీ లీగ్



మంగళగిరి సిటీ, అక్టోబరు 10: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి పట్టణంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ లీగ్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. రెండవ రోజైన గురువారం క్రీడాభిమానుల కేరింతలతో క్రీడా ప్రాంగణం కోలాహలంగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 14 పురుషుల జట్లు, 14 మహిళల జట్లు తలపడుతున్నాయి. ఇరు జట్లను నాలుగేసి గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో కబడ్డీ పోటీలు జరుగుతున్నాయి. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో నిర్వాహకులు క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. గురు వారం రాత్రికి లీగ్ దశ పూర్తయింది. శుక్రవారం నుంచి నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. రెండవ రోజు పురుషుల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లాపై కృష్ణా జిల్లా 11 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కర్నూలుపై విజయనగరం పది పాయింట్లు, చిత్తూరుపై గుంటూరు జిల్లా 35 పాయింట్లు, శ్రీకాకుళంపై కడప జిల్లా 11 పాయింట్లు, కర్నూలు జిల్లాపై ప్రకాశం జట్లు 18 పాయింట్లు, మంగళగిరిపై గుంటూరు జిల్లా 20 పాయింట్ల తేడాతో విజయం సాధించాయి. మహిళల విభాగంలో కర్నూలు జిల్లాపై ప్రకాశం జిల్లా 4 పాయింట్ల తేడాతో గెలుపొందింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు,క్రీడాభిమానులు పోటీ లను తిలకించారు.

దేశ, విదేశాలలో మహిషాసుర మర్దిని ఛాయాచిత్ర ప్రదర్శన



అమ్మవారి చిత్రాలు పరిశీలిస్తున్న డాక్టర్ హైమావతి

చుండూరు, అక్టోబరు 10 : శతాబ్దాల చరిత్ర కలిగిన దేశ, విదేశాలలోని మహిషాసుర మర్దిని శిల్పాల ఛాయ చిత్ర ప్రదర్శన ఉత్సుకత కలిగిస్తుందని కాకతీయ విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పోలవరపు హైమావతి అన్నారు. మోదుకూరులోని శ్రీవేమన వికాస పరిషత్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఛాయ చిత్ర ప్రదర్శనను గురువారం ఆమె ప్రారంభించారు. దసరా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా అనేక ప్రాంతాలలో ఉన్న అమ్మవారి ఛాయా చిత్రాలు సేకరించి వాటి వెనుక ఉన్న చరిత్ర, చారిత్రాత్మక సాంస్కృతిక సంబంధాలను విద్యార్థులకు, భక్తులకు, గ్రామస్తులకు వివరిస్తున్న నిర్వాహకుడు పురావాస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డిని ఆమె అభినందించారు. దేశ పురావస్తు చరిత్ర గురించి నేటి యువత కొంతైనా అవగాహనతో ఉండాలని, చరిత్ర మార్పులను గమనిస్తూ ఉండాలని తెలిపారు. ఈ ప్రదర్శన విద్యార్థులను, గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాల్లో ఫొటోజనిక్ ఆర్ట్ సర్కిల్ వ్యవస్థాపకుడు కానాల సుధాకరరెడ్డి, తియ్యగూర సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాధన చేస్తాం.. సాధిస్తాం

- అదరం, బెదరం..లక్ష్యంతో ముందుకు సాగుతాం
- అన్ని రంగాల్లో ముందుంటాం
- ఆణిముత్యాలకు సహకరిస్తే అన్నింటా విజయమే
- నేడు అంతర్జాతీయ బాలికల దినోత్సవం

చీరాలటౌన్, అక్టోబరు 10 : మేము ఎందులోనూ తక్కువ కాదంటూ బాలికలు వారివారి ఇష్టాయిష్టాలను లక్ష్యాలుగా ఎంచుకొని దూసుకుపోతున్నారు. ఒకపక్క చదువు, మరోపక్క ఆటపాటల్లో సాధన చేస్తూ అత్యుత్తమ ప్రతిభను కనబరుస్తున్నారు. ఈక్రమంలోనే తల్లిదండ్రులు గురువులు వారిని ఎంతగానో ఉత్సాహ పరుస్తూ చిన్నారుల భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ధైర్యాన్ని పెంచుతున్నారు. వారి విజయాలకు బాసటగా నిలుస్తున్నారు. ఆసక్తితో సాధన చేస్తున్న వారిలో కొందరు చిన్న, సన్నకారు కుటుంబాలు కావడంతో ఆర్థికంగా వెనుబడే ఉన్నారు. ఇటువంటి ఆణిముత్యాలకు ఆర్థిక భరోసా కల్పిస్తే దేశానికి గర్వకారుకులుగా ఎదుగు తారనడంలో అతిశయోక్తి ఉండదు. ఈ క్రమంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు చిన్నారులు వారి అనుభూతులను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

అమ్మా నాన్న ఆశయం కోసం

నేను ప్రస్తుతం దేశాయిపేట ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. నాన్న గోపీనాథ్, అమ్మ భ్రమరాంబ చేనేత కార్మికులు. ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. చదువుతోపాటు క్లాసికల్ డ్యాన్స్‌లో మంచి పేరు సాధించాను. వ్యవసాయమంటే ఇష్టం. బాగా చదువుకుని వ్యవసాయ అధికారిగా ఉద్యోగం చేయాన్నది లక్ష్యం.

\- చల్లా హర్షిణి, దేశాయిపేట





ఐపీఎస్‌ను అవుతా

తండ్రి కుమార్ కాంట్రాక్టర్. అమ్మ చంద్రకళ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి. నేను ప్రస్తుతం ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. షటిల్ బ్యాడ్మింటన్‌లో ఆసక్తి ఉండడంతో ఇప్పటికే రాష్ట్రస్థాయిలో పలుమార్లు ప్రాతినిధ్యం వహించాను. పతకాలు సాధించాను. భవిష్యత్‌లో ఐపీఎస్ అధికారిని అవుతాను.

\- గోవతోటి నితిక, పేరాల

ధైర్య సాహసాలతో లక్ష్యాలను సాధించాలి



ఆడ పిల్లలనే భయం అవసరం లేదు. ధైర్యే సాహసి. క్రమశిక్షణ, లక్ష్యాలపై గురి తప్పని సరిగా ఉండాలి. విద్యాబుద్ధులతో పాటు ఆటపాటల్లో రాణించి విజయాలు అందుకోవాలి. ప్రస్తుతం ప్రభుత్వం ఆడపిల్లల కోసం అన్ని విధాలుగా జాగ్రలు, పథకాలను అందిస్తోంది. అవకాశాన్ని వినియోగించుకుని విజయాలు సాధించాలి.

\- దేవకరొండ అఖిల, చీరాల ఆర్డీవో

ఐఏఎస్ చదవాలని ఉంది.. ఆర్థిక స్థోమత లేదు



అమ్మ శ్రీదేవి చాలా కష్టపడి చదివిస్తున్నారు. నాన్న లేరు. పేరాల హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాను. సాంస్కృతి కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటాను. గతంలో జాతీయస్థాయి సైన్స్ పోటీల్లో మెడల్ సాధించా. ఇటీవల జరిగిన చెకుముఖి పోటీల్లో మండల స్థాయిలో ప్రథమ బహుమతిని పొందా. ఈనెల 17న జరిగే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. స్వర్ణాంధ్ర-2047లో జిల్లా స్థాయి బహుమతి సాధించాను.

\- కోనాల భార్గవిశ్రీ



పసుమర్రు కాలువలో తుమ్మ చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

పసుమర్రు కాలువ అభివృద్ధి

- మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో చురుగ్గా పనులు
- కొప్పెరపాలెం నుంచి ఉప్పుమాగులూరు వరకూ చిల్లచెట్ల తొలగింపు

బల్లికురవ, అక్టోబరు 10 : మండల పరిధిలోని పసుమర్రు కాలువ అభివృద్ధి పనులు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ మేజర్ కాలువ ఆయకట్టులో ఉన్న ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం, సోమవరప్పాడు, గంగపాలెం గ్రామాలలో ఉన్న పంటలకు సకాలంలో నీరు అందకపోవడంతో రైతులు ఈ విషయాన్ని మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకు వెళ్లారు. దీంతో మంత్రి ఎన్ఎస్పీ అధికారులను వెంటనే పసుమర్రు మేజర్ కాలువ పరిధిలో ఉన్న కొప్పెరపాలెం నుంచి ఉప్పుమాగులూరు వరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కాలువలో ఉన్న తుమ్మ చెట్లను తొలగించాలని అధికార్లకు సూచనలు చేశారు. ఉప్పుమాగులూరు టీడీపీ నేతలు దేవినేని నరేంద్ర, అమరనేని వినోద్ కాలువ అభివృద్ధి పనులను దగ్గరుండి చేయిస్తున్నారు. సాగర్ కాలువ ద్వారా నీరు పంటలకు సకాలంలో అందేలా మేజర్ కాలువను అభివృద్ధి పరుస్తామని వారు తెలిపారు.

మానసిక ఆరోగ్యంతోనే ఆనందం



మాట్లాడుతున్న న్యాయవాది రఫీ

అద్దంకి, అక్టోబరు 10 : మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉంటే సమాజం శాంతి సౌఖ్యాలతో ఉంటుందని న్యాయవాది మహ్మద్‌రఫి అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక గాజులపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గొట్టిపాటి జయసింహ మాట్లాడుతూ శారీరక, మానసిక, సామాజిక, ఎమోషనల్‌గా ఆరోగ్యంగా ఉండడమే నిజమైన ఆరోగ్యమని అన్నారు. గర్భిణిలు, కౌమార దశలో ఉన్న బాలబాలికలు, వృద్ధుల మానసిక ఆరోగ్యం సక్రమంగా ఉంటే సమాజం ఆనందంగా ఉంటుందన్నారు. న్యాయవాది ప్రకాష్, ఆశా వర్కర్లు, సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

చినగంజాం, అక్టోబరు 10 : అన్ని గ్రామ పంచాయతీలలో ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ శ్రీనివాసమూర్తి గురువారం తెలిపారు. 14వ తేదీన సంతరావూరు, 15న గొనసపూడి, 16న చింతగుంపల్లి, కడవకుదురు, 17న మోటుపల్లి, 18న పల్లెపాలెం, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, 19న పెదగంజాం, నీలాయపాలెం, 20న చినగంజాం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు.

తహసీల్దార్‌గా వెంకటరత్నం

ఇంకొల్లు, అక్టోబరు 10 : ఇంకొల్లు తహసీల్దార్‌గా వెంకటరత్నం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ప్రమీల నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లగా కర్లపాలెంలో పని చేస్తున్న వెంకటరత్నం ఇక్కడకు వచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చినగంజాం, అక్టోబరు 10 : మండలంలోని పెదగంజాం ప్రాంతంలోని ప్రభుత్వ భూముల నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ని గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ శీలం రమేష్ తెలిపారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు పెదగంజాం ప్రాంతంలోని ప్రభుత్వ భూముల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్‌ని పోలీసుస్టేషన్‌కు తరలించి, డ్రైవర్‌ని అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చిల్ల చెట్ల తొలగింపు

మార్టూరు, అక్టోబరు 10 : మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో ఎస్సీ కాలనీ నుంచి లంబాడీ తాండా వరకు వెళ్లే రోడ్డుకు ఇరుపక్కల గురువారం చిల్ల చెట్లను తొలగించారు. ఈ రోడ్డుపైకి చిల్లచెట్లు చొచ్చుకురావడంతో ద్విచక్ర వాహనదారులు, ట్రాక్టర్లు ప్రయాణించడంతో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. చిల్లచెట్లు కారణంగా ముందు వచ్చే వాహనదారులు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు పంచాయతీ కార్యదర్శి మురళీ దృష్టికి తీసుకువచ్చారు. దాంతో సర్పంచ్ దాసరి నరేంద్ర బాబు సూచన మేరకు కార్యదర్శి మురళి చర్యలు చేపట్టారు.

ఓం దుం దుర్గాయనమః

- 8వ రోజు అలరించిన అలంకరణలు
- ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు
- పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు



అద్దంకి, చినగంజాం, పర్చూరులో దుర్గాదేవి అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవార్లు

అద్దంకి, అక్టోబరు 10 : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం పలు దేవాలయాలలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవార్లు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. శింగరకొండలోని గాయత్రీ పరమేశ్వరి ఆలయంలో దుర్గాదేవిగా అలంకరించారు. కన్యకాపరమేశ్వరి ఆలయ 53వ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 53కిలోల కేక్‌ను కమిటీ సభ్యులు కట్ చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ ఊటుకూరు రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు, భోజనపల్లి సత్యనారాయణ, చిన్ని వీరయ్య పీఎస్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్చూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భా గంగా గురువారం 8వ రోజు పలు దేవాలయాల్లో అమ్మవారిని శ్రీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం, శ్రీ అద్దంకి నాంచారమ్మ, శ్రీవేణుగోపాల స్వామి, చెరుకూరులోని శ్రీ అగస్తేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవార్లను దర్శించుకున్న భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్యనిర్వాహక కార్యదర్శి దామానాగేశ్వరావు పర్యవేక్షణలో స్వామివార్లకు పూజలు జరిగాయి. కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడు శ్రీరాం వెంకట సుబ్బారావు నేతృత్వంలో సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, భజన కార్యక్రమాలు జరిగాయి.


చినగంజాం : పలు గ్రామాల్లోని ఆలయా ల్లో దసరా పండుగను పురస్కరించుకొని శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవి మండపాలు, ఆలయాల్లో అమ్మవార్లను వివిధ అలంకరణల్లో పూజలు చేశారు. వాసవీ అమ్మవాని గురువారం మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. బతుకమ్మ అమ్మవారిని మహిళలు ప్రత్యేకంగా అలంకరించి పూజ లు నిర్వహించారు. సోపిరాలలో రామకోటేశ్వరస్వామి ఆలయంలోని లలితా పరమేశ్వరి, రైల్వేసెంటర్ భవానీపురంలోని విజయ కనకదుర్గాభవాని అమ్మవారు దుర్గాదేవిగా పూజలందుకున్నారు. గొనసపూడి, పెదగంజాం, నీలాయపా లెం, కడవకుదురు, సంతరావూరు తదితర గ్రామాల్లో భక్తులు పూజలు చేశారు.



మార్టూరులో శాకాంబరిగా, పంగులూరులో దుర్గగా

మార్టూరు : శరన్నవరాత్రి పూజలను భక్తులు భక్తిశ్రద్ధలో నిర్వహిస్తున్నారు. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా, ఘట్టేశ్వరస్వామి దేవస్థానంలో శ్యామలాంబదేవి దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. మహిళలు కుంకుమపూజ చేశారు. పాండురంగ స్వామి దేవస్థానంలో, వాసవీమాతకు మహిళలు పూజలు చేశారు. నాగరాజుపల్లిలో గంగా పార్వతీ సమేత శ్రీనాగలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమ్మ వా రిని కూరగాయలతో అలంకరణలో శాకాంబరీ అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు.

పంగులూరు : మండలంలోని రేణంగివరంలో గురువారం దుర్గామాత అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.





వైభవంగా అంకమ్మతల్లి దేవస్థాన వార్షికోత్సవం

యద్దనపూడి, (మార్టూరు) అక్టోబరు 10 : యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామంలోని శ్రీ అంకమ్మ తల్లి దేవస్థానం అనంత వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనారాయణం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారి మూలమంత్ర హోమం, విశేష కుంకుమార్చన, మహాపూర్ణాహుతి ఆశీర్వచన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రత్యేక హోమాలు, పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రత్యేక కౌంటర్లలో వంట నూనె అమ్మకాలు

ప్రారంభించిన ఆర్డీవో అఖిల



ప్రత్యేక కౌంటర్‌లలో ఆయిల్ ప్యాకెట్‌ను పంపిణీ చేస్తున్న ఆర్డీవో అఖిల

చీరాలటౌన్, అక్టోబరు 10 : పెరిగిన ధరలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో అన్ని విధాలా సమస్యలు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నట్లు ఆర్డీవో దేవరకొండ అఖిల పేర్కొన్నారు. ఇటీవల అనూహ్యంగా వంట నూనెల ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో జిల్లా ఉన్నత అధికారులు ఇప్పటికే ఆయిల్ ట్రేడర్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈక్రమంలోనే జిల్లాలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసి పామాయిల్ రూ.115, సన్ ఫ్లవర్ రూ.125 చొప్పున విక్రయించేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో చీరాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లను గురువారం ఆర్డీవో పరిశీలించారు. ఆమె చేతుల మీదుగా ప్రజలకు వంట నూనె ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ, పలువురు ఆయిల్ ట్రేడర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు అంచున భారీ గుంత

- తరచూ ప్రమాదాలు పట్టించుకోని అధికారులు



బొమ్మల సెంటర్‌లో భారీ గుంత

పర్చూరు, అక్టోబరు 10 : నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరిగే బొమ్మల సెంటర్ కూడలిలోని డ్రైనేజీ కాలువపై ఏర్పడిన భారీ గుంత ప్రమాదకరంగా మారింది. గ్రామంలోకి వెళ్లే రోడ్డు మలుపు వద్ద ఎలాంటి రక్షణ వలయం లేకపోవడంతో తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమీపంలో ప్రభుత్వ పాఠశాల ఉండడంతో ఆ గుంత వల్ల ఏం ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ వారి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న గుంత వద్ద వలయాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వ్యవసాయంలో నైపుణ్యం సాధించాలి

మార్టూరు, అక్టోబరు 10 : రైతులు వ్యవసాయంలో నైపుణ్యతను సాధించేందుకే పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం కోలలపూడిలో రైతులతో మాట్లాడారు. మేలైన సాగు పద్ధతులతో అధిక దిగుబడలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కిరణ్ కుమార్, వీఏఏ గోపికిరణ్ పాల్గొన్నారు.



- ఒక్కో టమాటా గుడ్డు ధరతో సమానం
- ఘాటెక్కిస్తున్న ఉల్లిగడ్డలు
- కేజీ రూ.35 నుంచి రూ.75కి పెరిగిన వైనం
- ఇతర కూరగాయలదీ అదే తీరు
- కిలో వంటనూనె రూ.140కి పైనే
- దిగుబడి తగ్గడమే కారణమంటున్న వ్యాపారులు

భయపెట్టిస్తున్న నిత్యావసరాలు

పండగ బెధర

నిత్యావసరాల ధరలు దౌడు తీస్తున్నాయి. సామాన్యుల కుటుంబాల్లో పండుగను దూరం చేస్తున్నాయి. జేబు నిండా డబ్బు తీసుకెళితే సంచి నిండా సరుకులు రాని దుస్థితి నెలకొంది. గోరుచుట్టుపై రోకటి పోటు అన్నట్టు సరుకుల ధరలను తట్టుకోలేక అల్లాడుతున్న సామాన్య మధ్యతరగతి కుటుంబాలపై కూరగాయల ధరలు కూడా కనికరం చూపడం లేదు. నిన్న మొన్నటి వరకు అందుబాటు ధరలో ఉన్న టమాటా ఐదు రోజులుగా కిలోకి నూరు దాటి జనం నోటమాట రాకుండా చేస్తోంది. ఉల్లిగడ్డ కొయ్యకుండానే కన్నీరు పెట్టిస్తోంది. ఏ కూరగాయ కొన్నా కిలో రూ.70కిపైనే ఉంటోంది. నూనెలు సలసల కాగుతున్నాయి. వరదల వల్ల ఉత్పత్తి తగ్గిపోవడం ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

- ఒంగోలు (కార్పొరేషన్)

సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్రభారం

కూరగాయల ధరలు (కేజీకి రూపాయల్లో)	
టమాటా	100
పచ్చిమిర్చి	70
క్యారెట్	80
బీరకాయ	70
చిక్కుడుకాయ	70
క్యారెట్	80
ఉర్లగడ్డ	70
బీట్‌రూట్	70
చిక్కుడు కాయలు	60
మునక్కాయలు	70
దొండకాయ	70
బెండకాయ	70
దోసకాయ	70
కాకర కాయ	70
వంకాయలు	70
కొత్తిమీర (కట్ట)	50
ఆకు కూరలు (కట్ట)	10

ఘాటెక్కిన ఉల్లి



గత నెల రోజుల క్రితం వరకు కేజీ రూ.30 పలికిన ఉల్లిగడ్డల ధర ఇప్పుడు రూ.75, రూ.80కి చేరింది. దీంతో వంటింట్లో ఉల్లి పేరు వినబడితేనే కన్నీళ్లు వచ్చే పరిస్థితి కనిపిస్తోంది.ఉల్లిపాయలు అత్యధికంగా కర్నూలు, షోలాపూర్ నుంచి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు, అక్కడ వర్ష ప్రభావంతో పంట దెబ్బతినడంతో పాత సరుకునే ప్రస్తుతం అమ్మకాలు జరుపుతున్నారు. ప్రత్యేకించి గతంలో కొనుగోలు చేసి నిల్వ ఉంచిన ఉల్లిపాయలను కేజీ రూ.70 నుంచి రూ.80 వరకు అమ్ముతుండగా, గత నెలరోజులు నుంచి కొనుగోలు చేస్తున్న ఉల్లిపాయలను రూ. 45 నుంచి రూ. 60 వరకు అమ్ముతున్నారు. అయితే వాటిని ఎక్కువ రోజు నిల్వ ఉంచే పరిస్థితి లేదు. తడి ఆరని కారణంగా ఎక్కువ రోజులు నిల్వ ఉంటే మొక్కలు వచ్చే పరిస్థితి ఉండటంతో పాత ఉల్లిపాకలకు డిమాండ్ పెరిగింది. ప్రతి ఏటా ఇదే సీజన్‌లో ఉల్లిపాయలకు డిమాండ్ రావడం సాధారణమే అని వ్యాపారులు వెల్లడిస్తున్నారు. ఏడాదిలో ఒకటి, రెండు నెలలు మాత్రమే కర్నూలు నుంచి రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాలకు ఉల్లిపాయలు దిగుమతి అవుతుండగా, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా అక్కడ కూడా పంట చేతికి రాకపోవడంతో ఉల్లిపాయల ధరలకు రెక్కలొచ్చాయి. సాధారణ రోజుల్లో నెలకు సుమారు 10 నుంచి 15 టన్నులు జిల్లాకు వస్తుండగా, ప్రస్తుతం పంట నష్టం రావడంతో దిగుబడి తక్కువ కారణంగా ప్రస్తుతం 5 నుంచి 8 టన్నులు కూడా వచ్చే పరిస్థితి లేదని వ్యాపారులు అంటున్నారు. అందుకే ఉల్లిపాయలకు డిమాండ్ పెరిగిందని చెబుతున్నారు.



మండిపోతున్న వంట నూనె

గత నెల రోజు క్రితం వరకు సామాన్యులకు అందుబాటులోఉన్న వంట నూనె ఇప్పుడు ఏకంగా కేజీ రూ.140కి పెరిగింది. గతంలో రూ.100లోపు ఉన్న కేజీ ఫ్రీడమ్ రూ.140కి పెరగ్గా, పామాయిల్‌లు ఇప్పుడు రూ.125కి పెంచేశారు. వేరుశనగ నూనె ధర నిలకడగానే ఉంది. అయితే నిరంతరం వంటకు నూనె అవసరం కావడంతోపాటు, హోటళ్లు, ఇతర మాంసాహార పదార్థాల విక్రయాలు, రోడ్‌సైడ్ తినుబండరాలైన బోండాలు, బజ్జీలు ఇతరత్రా వ్యాపారులు, చికెన్ పకోడి వంటి చిరు వ్యాపారులకు ఒక్కసారిగా పెరిగిన నూన ధరలు దడ పుట్టిస్తున్నాయి. ఒక్కో బాక్స్ పది కేజీల ప్యాకెట్‌లు లభిస్తుండగా ఒక్క బాక్స్‌పై ఏకంగా రూ.400కు పైగా పెరగడంతో అటు చిరు వ్యాపారులు, టిఫినెన్ సెంటర్లు, బిర్యానీ సెంటర్లు వారు విక్రయించే ఆహార పదార్థాల ధరలను కూడా ఒక్కసారిగా పెంచేశారు.

గుడ్డు ధరకు ఒక టమాటా



టమాటా ధరలు ఆకాశాన్నంటాయి. ఐదు రోజులుగా కేజీ రూ.100 పలుకుతున్నాయి. సాధారణ సైజు టమోటాలు కేజీకి 14 వరకు వస్తున్నాయి. ఒక్కొక్క టమాటా రూ.7 పడుతోంది. ఇది కోడి గుడ్డు ధరతో సమానంగా ఉంది. ఒక టమాటా కొనే కన్నా ఒక గుడ్డు కొనుక్కోవడం మేలనే పరిస్థితి ఏర్పడింది. రెండేళ్ల నుంచి జిల్లాలో టమాటా సాగు లేకపోవడంతో మదనపల్లి, పలమనేరు, పుంగనూరు నుంచి వ్యాపారులు కొంటున్నారు. రోజుకు 30 నుంచి 40 టన్నులు జిల్లాకు వస్తోంది. కేవలం ఒంగోలుకే అత్యధికంగా 25 టన్నుల వరకు సరఫరా అవుతోంది. నెల క్రితం వరకు పంట దిగుబడి అధికంగా ఉండటంతో ధర లేక కేజీ రూ.20 నుంచి రూ.40 వరకు అమ్మకాలు జరిగేవి, అయితే గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలు కారణంగా పంట నష్టపోవడంతో ఉన్న అరకొర సరుకునే దిగుమతి చేసుకుంటున్నారు. ప్రస్తుతం రోజుకు 20 టన్నులు కూరగాయల మార్కెట్‌కు చేరుతుండగా, కేవలం మూడు టన్నుల టమాటా రైతు బజారుకు చేరుతోంది. పంటసాగు తగ్గడంతోపాటు దిగుబడి తగ్గడంతో మదనపల్లి, పలమనేరు, పుంగనూరులోనే రైతు వద్ద నుంచి కేజీ రూ.80 కొనుగోలు చేయాల్సి వస్తోంది. రవాణా ఖర్చులు, లాభం కలుపుకుని మార్కెట్‌లో కేజీ రూ.100 అమ్ముతున్నారు. ఇదే పరిస్థితి మరో పది, పదిహేను రోజులు ఉండేలా ఉంది.



దిగుబడి తగ్గడం వల్లే ధరలు

అధిక వర్షాలతో పంట నష్టం రావడం, దిగుమతి తగ్గడం వల్లే కొరత ఏర్పడి ధరలు పెరిగాయి. డిమాండ్‌ను పట్టి వ్యాపారులు ధర నిర్ణయిస్తారు.

- కటారి కృష్ణ, హోల్ సేల్ వ్యాపారి

మద్యం కిక్కు

- విదేశాల నుంచి దుకాణాలకు దరఖాస్తు

ఇప్పటివరకు 2,481 దాఖలు ● ఆ ఫీజు ద్వారా రూ.49.62 కోట్లు

- లైసెన్స్ ద్వారా మరో రూ.106 కోట్ల ఆదాయం



ఒంగోలు(క్రైం), అక్టోబరు 10 : కిక్ బాగేంది. నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఈనెల 9 వరకు దాఖలుకు గడువు ఇచ్చిన ప్రభుత్వం దానిని 11 వరకు పెంచింది. అదేక్రమంలో జిల్లాలో మద్యం వ్యాపారం చేసేందుకు విదేశాల నుంచి దరఖాస్తులు చేసుకోవడం గమనార్హం. న్యూజెర్సీలో ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు ఒంగోలులోని మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తు చేశారు. 2017 తరువాత మద్యం దుకాణాలకు తిరిగి దరఖాస్తులు తీసుకోవడం 2024లో కావడంతో అప్పట్లో మద్యం వ్యాపారం చేసిన పాత వారితోపాటుగా ప్రసుతం యువ వ్యాపారులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కూడా ఉత్సాహం చూపుతున్నారు. అదేక్రమంలో ఈ ఏడాది మద్యం దుకాణాల ఫీజులను ప్రభుత్వం భారీగా పెంచేసింది. కేవలం లైసెన్స్ ఫీజు ద్వారానే రూ.106.05 కోట్లు ఆదాయం రానుంది. మొత్తం 171 మద్యం దుకాణాలు ఉండగా 120 దుకాణాలకు రూ.65 లక్షలు, 51 దుకాణాలకు రూ.55లక్షలు చొప్పున మొత్తం రూ.106.05 కోట్లు వసూలు కానుంది. దరఖాస్తు ఫీజు రూ.49.62 కోట్లు ప్రస్తుతానికి వచ్చింది.

నేటితో ముగియనున్న గడువు

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే గడువు శుక్రవారం సాయత్రం 7 గంటలతో ముగియనుంది. గురువారం రాత్రి వరకు 171 దుకాణాలకు 2,481 దరఖాస్తులు వచ్చాయి. అదేక్రమంలో 10కి తక్కువగా వచ్చిన దుకాణాలకు తిరిగి దరఖాస్తులు కోరే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా నియోజకవర్గాల వారీగా ఆయా దుకాణాలకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి అనేది కూడా అధికారులు పరిశీలన చేస్తున్నారు.

ముఖ్యమంత్రి కానుక గీతకార్మికుడికి మద్యం దుకాణం

మద్యం నూతన పాలసీలో భాగంగా గీత కార్మికులకు జిల్లాలో ప్రభుత్వం 17 మద్యం దుకాణాలు కేటయించింది. కాగా గత నెల 20న ముఖ్యమత్రి చంద్రబాబునాయుడు నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి కానుకగా గీత కార్మికు డు ఆలుదా సు శ్రీనుకు దుకాణం ఇవ్వాలని ఆదేశిం చారు. దీంతో 18 మద్యం దుకాణాలు అదనంగా మరో నోటిఫికేషన్ రానుంది. అయితే కల్లుగీత కార్మికులకు కేటాయించే దుకాణాల లైసెన్స్, దరఖాస్తు ఫీజులు కూడా 50శాతం రాయితీ ఉండే అవకాశం ఉంది.

నేటితో ముగియనున్న గడువు

23 షాపులకు అందినవి 267 దరఖాస్తులు

ఇంకా పెద్దఎత్తున దాఖలయ్యే అవకాశం ● ఏఈఎస్ వెంకటేశ్వర్లు

అద్దంకి, అక్టోబరు 10 : మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా శుక్రవారం సాయంత్రం 7 గంటల వరకు గడువు పొడిగించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఏఈఎస్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గురువారం అద్దంకి సర్కిల్ పరిధిలోని 23 షాపులకు 267 దరఖాస్తులు అందాయన్నారు. మండలాలవారీగా అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో 5 షాపులకు 63, రూరల్ మండల పరిధిలో 2 ఇంటికి 13, బల్లికురవ మండలంలో 4 ఇంటికి 37, కొరిశపాడు మండలంలో 4 ఇంటికి 62, పంగులూరు మండలంలో 3కుగాను 56, సంతమాగులూరు మండలంలో 5 దుకాణాలకు 36 దరఖాస్తులు అందాయని తెలిపారు. శుక్రవారం సాయంత్రానికి పెద్ద మొత్తంలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఉత్సాహవంతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సీఐ భవాని ఉన్నారు.

పర్చూరు డివిజన్‌లో 366 దరఖాస్తులు

పర్చూరు : మద్యం షాపుల టెండర్లకు సంబంధించిన దరఖాసు గడువు శుక్రవారంతో ముగియనుంది. దీంతో వ్యాపారులు పోటీపడుతుండడంతో ప్రక్రియ ఊపందుకుందుకుంది. పర్చూరు ఎక్సైజ్ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 15 దుకాణాలకు టెండర్ ప్రక్రియ ఉండగా, ఇప్పటికే 366 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇంకొల్లు, మార్టూరు మండలాల్లో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇంకొల్లు మండలంలో మొత్తం మూడు దుకాణాలకు 121 దరఖాస్తులు, మార్టూరు మండలానికి సంబంధించి మొత్తం 6 ఇంటికి గాను 167, పర్చూరు మండలానికి 63, యద్దనపూడి మండలానికి 15 చొప్పున దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

16వ తేదీ నుంచి నూతన మద్యం పాలసీ

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్‌నాగరాజు



తనిఖీ చేస్తున్న హేమంత్‌నాగరాజు

చీరాలటౌన్, అక్టోబరు 10 : వచ్చే బుధవారం నుంచి నూతన మద్యం పాలసీ విధానం అములులోకి వస్తుందని ప్రకాశం, బాపట్ల జిల్లాల ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు పేర్కొన్నారు. గురువారం చీరాల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఇప్పటి వరకు జరిగిన టెండర్ ప్రక్రియపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న ఏడు సర్కిళ్లలో ప్రభుత్వం కేటాయించిన 117 షాపులకు ప్రస్తుతానికి 1350 దరఖాస్తులు అందినట్లు చెప్పారు. చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు పరిధిలోని 24 దుకాణాలకు గాను 276 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. శుక్రవారం రాత్రి 12 గంటల వరకు ఆన్‌లైన్ అందుబాటులో ఉంటుందన్నారు.

ఆరోగ్యం కోసం వెళితే.. అనారోగ్యమే!

- కుందేరు ఒడ్డును చెత్త కుప్పలు
- పట్టించుకోని అధికారులు ● ఆందోళనలో వాకర్స్

చీరాల, అక్టోబరు 10 : ఆరోగ్యం కోసం వెళితే .. అనారోగ్యం వెంటాడినట్లుగా ఉందని పలువురు వాకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామానాయుడు పార్కు, కుందేరు మధ్య చెత్త, చెదారం పేరుకుపోయింది. దోమలు, పందులు, కుక్కలు, ఇతర మూగ జీవాలకు ఆవాసంగా మారింది. దీంతో ఆ ప్రాంతంలో దుర్గంధం వెదజల్లుతోంది. ఈ క్రమంలో తాము ఆరోగ్యం కోసం రామానాయుడు పార్కుకు నడక (వాకింగ్ కు)కు వస్తుంటే చెత్త కుప్పలతో ఉన్న అక్కడి పరిసరాలతో ఎలాంటి వ్యాధులబారిన పడతామోనని వాకర్స్ ఆందోళన చెందుతున్నారు. స్వచ్ఛ హి సేవ, స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్రప్రదేశ్ ఇలా పలు రకాల పేర్లతో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల్లో తప్ప మిగతా రోజుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టడంలేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుందేరు, రామానాయుడు పార్కులను శుభ్రంగా ఉంచి, ఆరోగ్యకరమైన వాతారణం కల్పించాలని వాకర్స్‌తో పాటు ప్రజలు కోరుతున్నారు.



రామానాయుడు పార్కు, కుందేరు మధ్య పేరుకుపోయిన చెత్త

వారంలోపు కంచె వేయిస్తాం

చెత్త సమస్య మా దృష్టికి వచ్చింది. వాకర్స్ అసోసియేషన్ వారితో మాట్లాడాం. ఇవాళ, రేపు చెత్తను తొలగిస్తాం. వారం రోజుల్లో ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేయిస్తాం. పూర్తి స్థాయిలో ఆరోగ్యకరమైన వాతావరణం నెలకునేలా చర్యలు చేపడతాం.

- అబ్దుల్ రషీద్, మున్సిపల్ కమిషనర్, చీరాల

జల్లుజల్లున..

- జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వాన
- చల్లబడిన వాతావరణం
- జనజీవనానికి ఆటంకం

ఒంగోలు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా జల్లులు పడుతున్నాయి. కొన్నిప్రాంతాల్లో ఒక మోస్తరు వాన పడింది. రెండురోజులుగా ముసురు పట్టి తెరలు,తెరలుగా పడుతున్న జల్లులు జనజీవనానికి కొంత ఆటంకం కలిగింది నిన్న మొన్నటి వరకు ఉన్న ఎండల తీవ్రత, ఉక్కపోత తగ్గడంతో ప్రజానీకం కాస్తంత ఊపిరిపీల్చుకుంటున్నారు. గత పక్షం రోజులుగా జిల్లాలో పొడి వాతావరణమే ఉండగా మంగళవారం రాత్రి నుంచి జల్లులు పడుతున్నాయి. బుధవారం పగలు, రాత్రి పలుచోట్ల ఒక మోస్తరు వానే కురిసింది. జిల్లాలో గురువారం ఉదయానికి గడిచిన 24 గంటల్లో సగటున 9.70 మి.మీ వర్షపాతం నమోదైంది. గరిష్ఠంగా టంగుటూరు మండలంలో 37.20 మి.మీ కురవగా కొండపిలో 30.6, తాళ్లూరులో 25.2, బీపేటలో 24.60, మద్దిపాడులో 21.20, త్రిపురాంతకంలో 20.4 మి.మీ కురిసింది. కనిగిరి, కొనకనమిట్ల, సంతనూతలపాడు, పొన్నలూరు, ఒంగోలు తదితర మండలాల్లో 15 నుంచి 20 మి.మీ పడింది. మరో ఐదారు మండలాల్లో జల్లులు పడ్డాయి. తిరిగి గురువారం పగటిపూట కూడా జిల్లాలోని చాలాప్రాంతాల్లో జల్లులు పడుతూనే ఉన్నాయి. ఆకాశం పూర్తిగా



మేఘావృతం కావడంతో పాటు తెరలుతెరలుగా జల్లులు పడ్డాయి. జిల్లాలో గురువారం పగటిపూట ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, కనిగిరి, మార్కాపురం, హెచ్‌ఎంపాడు, పొదిలి, కేకేమిట్ల, తాళ్లూరు, తర్లుపాడు, రాచర్ల తదితర మండలాల్లో 20 నుంచి 35 మి.మీ వర్షపాతం నమోదైంది. కాగా పగటిపూట అంతా జల్లులు పడుతుండటంతో పట్టణవాసులు రోజువారీ పనులకు ఆటంకం ఏర్పడింది.


గిరిజనుల అభ్యున్నతికి కృషి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఎర్రగొండపాలెం (పుల్లలచెరువు), అక్టోబరు 10: చెంచుల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ప్రభుత్వ చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. గురువారం ఎర్రగొండపాలెం మండలంలో ఆమె విస్తృతంగా పర్యటించారు. మండలంలోని గంజివారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లిపాలెం గిరిజనులు చెంచుగూడేంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలను అమలుజేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆమె సార్డ్ ఆధ్వర్యంలో రూ.26 లక్షలతో నిర్మించిన బాల ప్రకాశ భవనంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత చెంచుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు సార్డ్ సంస్థ కృషి చేయడం అభినందనీయమన్నారు. గిరిజనులకు అనసరమైన మౌలిక వసతులు కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జన్‌మన్ కార్యక్రమం ద్వారా అనేక సంక్షేమ పథకాలు చేపట్టాయన్నారు. అల్లిపాలెం చెంచుగూడేంలో ఇళ్లు నిర్మించాలని, రోడ్డుబాగు చేయించాలని, వసతిగృహం నిర్మించాలని స్థానికులు కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. అదేవిధంగా అల్లిపాలెం చెంచుగూడేంకు 40 కుటుంబాలకు అంత్యోదయ రేషన్ కార్డులు, కమ్యూనిటీ హెల్త్ సెంటరు, సార్డ్ నిర్మించిన భవనానికి కంపౌండ్ వాల్ నిర్మించాలని కోరారు. అనంతరం ఆమె కుడుముల భయన్న ఇంటిని సందర్శించారు. వారి స్థితి గతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. భయన్న మాట్లాడుతూ తనకు పక్కా గృహం నిర్మించాలని, తమ పిల్లలు చదువుకోనేందుకు వసతి గృహం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అందులో వున్న చిన్నారులకు 15 మంది విద్యార్థులకు ఆధార్‌కార్డు లేకపోవడంతో వీరికి పౌష్టికాహారం అందడంలేదని తెలుపగా వెంటనే ఆధార్ క్యాంపు పెట్టి ఆధార్‌కార్డులు నమోదు చేయాలని చర్యలు తీసుకోవాలని అన్నారు.

వైద్యశాలను సందర్శించిన కలెక్టర్

అనంతరం ఎర్రగొండపాలెంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రోగులకు అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వివిధ విభాగాలను, వార్డులను ఆమె పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్యులు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని అన్నారు. వైద్యశాలకు కాంపౌడ్ వాల్, వైద్యశాల ఆవరణలో లెవలింగ్ పనులు చేయాలని వైద్యశాలసూపర్‌డెంట్ యాదీద్యా ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పుల్లలచెరువు రోడ్డులో నిర్మించిన రైతుబజారును పరిశీలించారు. రైతుబజారు ఆవరణలో లెవలింగ్ పనులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టరు సహదీత్ వెంకట త్రివినాగ్, తహసీల్దార్ బాల కిషోర్, ఎంపీడీవో శ్రీనివాసరావు, మార్కెటింగ్ శాఖ ఏడీ ఉపేంద్ర కుమార్, సార్డ్ పీడీ సునీల్ కుమార్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.









నెల్లూరు : దుర్గాదేవిగా రాజరాజేశ్వరి

నెల్లూరు : లలితాదేవి అలంకరణలో ఇరగాళమ్మ

నెల్లూరు రూరల్ : వేదగిరిపై విద్యాలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో దుర్గాగా కామాక్షితాయి

నెల్లూరు : కోదండరామపురంలో దుర్గాదేవి అలంకరణలో శాకంబరిగా మహాలక్ష్మి

ఓం దుర్గాయై నమః

నెల్లూరు (సాంస్కృతికం): జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు 8వ రోజుకు చేరాయి. గురువారం దుర్గాదేవి అలంకరణలో అమ్మ ణ్ణులు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సం దర్భంగా హోమాలు, నవావరణ పూజలు, లలితా సహస్ర నామ పారాయణాలు జరిగాయి. అమ్మవార్లను దర్శిం చుకునేందుకు భక్తులు బారు లు తీరారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. సంపుటీకరణ చండీ హోమం, నవా వరణ పూజలు, లలితా సహస్ర నామ పూజలు జరిగా యి. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. అమ్మవారికి భక్తులు రాగిపై బంగారు పూత పూసిన కిరీటా న్ని బహూక రించారు. స్టోన్ హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వ రి ఆలయంలో దుర్గాష్టమి పూజ, కుంభం పోయుట, ఉత్సవాలు జరిగాయి. అమ్మవారికి దుర్గాదేవి, మూలవి రాట్‌కి కుంకుమ, నిమ్మకాయలతో అలంకారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శుక్రవారం ఉదయం కన్యపూజ జరగనుంది. మూలాపేట ఇరుకళల పరమేశ్వరి అమ్మవారు లలితా పరమేశ్వరి అలంకరణలో దర్శన మిచ్చారు. మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో భువ నేశ్వరి అమ్మవారికి దుర్గాదేవి అలంకారం వైభవంగా జరిగింది. కోదండరామపురం మహాలక్ష్మి ఆలయంలో దుర్గాదేవి అలంకారం ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న అమ్మణ్ణుల అలంకరణలు ● భక్తులతో శోభిల్లిన ఆలయాలు



నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



నెల్లూరు : దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి



రాపూరు : కోనలో దుర్గాదేవిగా ఆదిలక్ష్మి



● ఉత్సవ కమిటీలో చీలిక

నగరంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వేసిన ఉత్సవ కమిటీలో సభ్యులు రెండు వర్గాలుగా చీలిపోయారు. కమిటీ సభ్యులు తమ బంధుమిత్రులకు వీఐపీ దర్శనాలు ఇస్తున్నారంటూ భక్తులు ఆరోపిస్తున్నారు. ఉత్సవ కమిటీలో ఓ సభ్యుడు నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించి తన ఏజెంట్ల ద్వారా వీఐపీ దర్శనాలు చేయిస్తుండగా ఉత్సవ కమిటీ సభ్యులు ఇద్దరిని పట్టుకున్నారు. అలాగే టీడీపీకి చెందిన ఓ నాయకుడు తన కుటుంబ సభ్యులకు దర్శనం చేయించలేదని ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. అలాగే ఆలయంలో కూడా కొంతమంది సిబ్బంది తీరు విమర్శలకు దారి తీసింది.

● నేడు రావణ సంహారం

దేవీ నవరాత్రులలో భాగంగా శుక్రవారం సాయంత్రం రాజరాజేశ్వరి ఆలయం వద్ద రావణ సంహారం జరగనుంది. దాదాపు 65 అడుగుల ఎత్తులో దశ కంఠుడైన రావణాసురుడి ప్రతిమకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఆయన మిత్ర బృందం రూ.10లక్షలకుపైగా ఖర్చు చేస్తున్నారు. హైదరాబాద్ సమీపంలో కళాకారులు ఈ ప్రతిమను రూపొందించారు. ఈ ప్రతిమలో అమర్చిన టపాకాయలు, రంగురంగుల కాకర్స్ భక్తులను ఆకట్టుకోనుంది. సాయంత్రం 6గంటలకు ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి బాణం వేసి రావణ సంహార కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.

నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో నృత్యం చేస్తున్న యువతి

182 దుకాణాలకు
2,807 దరఖాస్తులు

మద్యం షాపుల టెండర్లకు నేటితో గడువు పూర్తి

చివరి రోజును భారీగా దాఖలయ్యే అవకాశం ● విస్తృత ఏర్పాట్లు చేసిన ఎక్సైజ్ శాఖ

నెల్లూరు (క్రైం), అక్టోబరు 10 : ప్రైవేటు వైన్‌షాపుల కోసం దరఖాస్తుల దాఖల గడువు నేటితో ముగియనుంది. శుక్రవారం రాత్రి 7 గంటల వరకే గడువు ఉండటంతో భారీ సంఖ్యలో దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. కాగా, గురువారం సాయంత్రం వరకు జిల్లాలోని 182 వైన్‌షాపులకు 2,807 దరఖాస్తులు అందాయి. ఒక్కో షాపునకు రూ.2లక్షల చొప్పున దరఖాస్తు ఫీజు చెల్లించగా, మొత్తం దరఖాస్తులకు రూ.56.14 కోట్లు ప్రభుత్వ ఖాజానాకు జమ అయ్యింది. చివరి రోజున 2వేలకుపైగా దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు జిల్లాలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రాత్రి 7 గంటలకు స్టేషన్ లోపలకు వచ్చిన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తు తీసుకోనున్నట్లు ఎక్సైజ్ డీసీ శ్రీనివాసరావు తెలిపారు. అర్ధరాత్రి అయినా ప్రతి దరఖాస్తును స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎంట్రీ పాస్ ఇచ్చేలా అధికారులు సిద్ధంగా ఉన్నారు. 12, 13వ తేదీలలో దరఖాస్తుల పరిశీలన, 14వ తేదీ ఉదయం నెల్లూరులోని కస్తూరిబా కళాక్షేత్రంలో లాటరీ విధానంలో వైన్‌షాపుల లైసెన్సులను వ్యాపారులకు అందిస్తారు.

● సైదాపురంలోనే అత్యధికం

వైన్‌షాపులకు దరఖాస్తు చేసుకునే వ్యాపారులకు ఆయా పరిధుల వారీగా షాపుల నెంబర్లను కేటాయించారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 30 షాపులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండగా ఎన్ఎల్ఆర్/1 నుంచి 30 వరకు షాపులకు నెంబర్లు కేటాయించారు. ఇదే విధంగా జిల్లావ్యాప్తంగా ఎన్ఎల్ఆర్/1 నుంచి ఎన్ఎల్ఆర్/182 వరకు నెంబర్లు గజిట్‌లో కేటాయించారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలో ఉన్న ఎన్ఎల్ఆర్/62 వైన్ షాపునకు 4, ఎన్ఎల్ఆర్/63 షాపునకు 4, కొండాపురం మండలంలోని ఎన్ఎల్ఆర్/115 షాపుకు 4 దరఖాస్తులు అతి తక్కువగా నమోదు అయ్యాయి. ఇక సైదాపురం మండలంలోని ఎన్ఎల్ఆర్/162 షాపునకు 35, లింగసముద్రం మండలంలోని ఎన్ఎల్ఆర్/175 షాపునకు 34, చేజర్ల మండలంలోని ఎన్ఎల్ఆర్/155 షాపునకు 33 అధికంగా దరఖాస్తులు అందాయి.



పొదలకూరులోని ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

● పొదలకూరులో తనిఖీ

పొదలకూరు : స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను కలెక్టర్ ఆనంద్ తనిఖీ చేశారు. మద్యం దుకాణాల కేటాయింపునకు జరుగుతున్న దరఖాస్తుల ప్రక్రియను ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. 17 మద్యం దుకాణాలను 320 దరఖాస్తులు వచ్చినట్లు సీఐ వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే దరఖాస్తులు స్వీకరించాలని కలెక్టర్ సూచించారు.

గత వైసీపీ పాలనలో గాడి తప్పిన నీటి యాజమాన్యాన్ని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టే దిశగా అడుగులు వేస్తున్నది. నీటిపారుదల రంగంలో ప్రముఖ పాత్ర పోషించే లస్కర్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అంతేగాక బకాయి వేతనాలను కూడా ఇచ్చేందుకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిపేలా చర్యలు ప్రారంభించింది. సాగునీటి రంగంపై కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై జిల్లా రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నది.

- లస్కర్ల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
- 230 మందిని నియమించుకునే అవకాశం
- మూడేళ్ల నుంచి వారు లేకనే సాగు
- ఫలితంగా నీటి దుర్వినియోగం.. రైతుల అవస్థలు
- సాగునీటి రంగాన్ని గాలికొదిలేసిన వైసీపీ సర్కారు

గాడిన పడనున్న
నీటి యాజమాన్యం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : జలవనరుల శాఖలో లస్కర్ల నియామకానికి ప్రభుత్వం నుంచి అనుమతులు లభించాయి. మూడేళ్ల నుంచి వారు లేకపోవడంతో నీటి యాజమాన్యం సక్రమంగా జరగలేదు. దీంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం తాజా నిర్ణయంతో నీటి యాజమాన్యంలో కష్టాలు తప్పనున్నాయి. సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని ఇటీవల నిర్ణయం తీసుకోగా.. తాజాగా నీటి యాజమాన్యంలో లస్కర్ల నియామకానికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా రానున్న సీజన్‌కు సుమారు 230 మంది లస్కర్లను నియమించుకునే అవకాశం ఏర్పడింది. రానున్న సీజన్‌కు గానూ ఓఅండ్ఎం వర్కులను జిల్లా నుంచి ప్రతిపాదించారు. ఈ వర్కులను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫండ్స్ కింద అప్రూవల్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులోనే లస్కర్లకు కూడా వేతనాలు చెల్లించేలా ప్రతిపాదించింది.

● జీతాలు ఇవ్వకుండా తొలగింపు

వ్యవసాయ ఆధారితమైన జిల్లాలో నీటి యాజమాన్యం చాలా కీలకమైంది. కాలువల ద్వారా చివరి ఆయకట్టు వరకూ నీరు వెళ్లేలా చూడడంలో లస్కర్లు కీలకంగా వ్యవహరిస్తారు. అవసరానికి తగినట్లుగా తూముల వద్ద చెక్కలు ఎత్తడం, దించడం లస్కర్ల విధి. ఏ కాలువ కిందనైనా ఆయకట్టుకు నీరు సరిపోకపోతే ఆ విషయాన్ని వెంటనే ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిపడా నీరు విడుదల చేయిస్తారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన లస్కర్లపై వైసీపీ ప్రభుత్వం కక్ష గట్టింది. మూడేళ్ల నుంచి లస్కర్ల నియామకానికి ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదు. దీంతో రైతులే నానా తంటాలు పడుతూ తూములు ఎత్తుకుంటూ, దించుకుంటూ పంటల సాగు చేసుకున్నారు. లస్కర్లను నియమించకపోగా అప్పటి వరకూ పని చేస్తున్న 230 మందిని తొలగించింది. అంతేగాక వీరికి రెండేళ్ల వేతనాలు కూడా బకాయిలు పెట్టింది.

● 20 టీఎంసీల వృథా

లస్కర్లకు నెలకు రూ.10,500 వేతనంగా చెల్లిస్తారు. సీజన్‌కు ఐదు నెలలు మాత్రమే వీరు పనిచేస్తారు. రెండు పంటలు వేస్తే ఏడాదిలో పది నెలలు లస్కర్లు విధుల్లో ఉంటారు. ఆ లెక్కన జిల్లామొత్తంగా చూసుకున్నా ఏడాదికి రూ.2 కోట్లకు మించి లస్కర్లకు ఖర్చు కాదు. సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ లస్కర్ల నియామకానికి అనుమతులు ఇవ్వలేదు. ఫలితంగా గతేడాది రెండో పంట సీజన్‌లో భారీగా నీటి దుర్వినియోగం జరిగింది. కాలువలపై తూములు ఆపరేట్ చేసే వారు లేకపోవడంతో ఇష్టానుసారంగా నీటి విడుదల జరిగింది. దీంతో జరిగిన సాగుకు, విడుదల చేసిన నీటి పరిమాణానికి అసలు పొంతనే లేకుండా పోయింది. ఆ సీజన్‌లో దాదాపు 20 టీఎంసీల నీరు వృథా అయ్యింది. ఈ ప్రభావం గతేడాది ఖరీఫ్ సీజన్‌పై పడింది. వర్షాలు లేకపోవడంతో సగం ఆయకట్టుకు కూడా నీటి కేటాయింపులు చేయలేకపోయారు. దాదాపు మూడు లక్షల ఎకరాలను గత సీజన్‌లో బీడు పెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది. ఈ నీటి వృథా విలువ రూ.వందల కోట్లలో ఉంటుందని సాగునీటి రంగ నిపుణులు చెబుతున్నారు.

ఓఅండ్ఎంలోనే ప్రతిపాదించాం

రానున్న సీజన్‌కు లస్కర్లను నియమించుకునేందుకు ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. వారి నియామకానికి అవసరమైన బడ్జెట్‌ను ఓఅండ్ఎంలోనే ప్రతిపాదించాం. రైతులకు ఇబ్బందులు లేకుండా నీటి యాజమాన్యం చేస్తాం.

- పీ కృష్ణమోహన్, ఇరిగేషన్ ఎస్ఈ

నిత్యావసరాల కోసం
ప్రత్యేక స్టాళ్లు

నేటి నుంచి మండల కేంద్రాల్లో ఏర్పాటు

ధరల నియంత్రణకు యంత్రాంగం సన్నద్ధం


నెల్లూరు (హరనాథపురం) : వినియోగదారులకు సరసమైన ధరలకే నిత్యావసర సరకులు అందజేసేందుకు మండల కేంద్రాల్లో శుక్రవారం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో మండల స్థాయిలో ప్రత్యేక స్టాళ్ల ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అప్రమత్తమై వంట నూనెల తయారీ సంస్థలు, డీలర్లు, రైస్‌మిల్లర్లు, పప్పుదినుసుల మిల్లర్లతో మాట్లాడింది. తయారీ సంస్థ నిర్ణయించిన ధరకే నిత్యావసరాలను ఇప్పించడానికి గురువారం డీలర్లతో జాయింట్ కలెక్టర్ కార్తీక్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పామాయిల్, సన్‌ఫ్లవర్, ఎర్రగడ్డలు, టమోటాలు, పప్పుదినుసుల ధరల పెరుదలను అదుపులో ఉంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో వినియోగదారుల కోసం స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జేసీ ఆదేశాలు అందుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు మండల స్థాయిలో శుక్రవారం నుంచి స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేయించి నిత్యావసర సరకులను సరళమైన ధరలకు అందించడానికి సిద్ధమయ్యారు.

స్టాంపుల సమస్య
తీరినట్టేనా!?

రిజిస్ట్రేషన్ కార్యకలాపాలకు వినియోగించే నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత త్వరలో తీరనుంది. కూటమి ప్రభుత్వం ఆ స్టాంపుల వైపే మొగ్గు చూపడంతో వీటి కొరత దాదాపుగా తీరే అవకాశం ఏర్పడింది. గత వైసీపీ ప్రభుత్వం నాన్ జ్యుడీషియల్ స్టాంపులను తెప్పించకపోగా, వాటి స్థానంలో ఈ-స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టి, ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాన్ జ్యుడీషియల్ స్టాంపులపై దృష్టి సారించి వినియోగదారులకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంది.

- నెల్లూరు (హరనాథపురం)

- 'ఈ-స్టాంపింగ్' కాగితాలు ఇక లేనట్టే!
- నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వైపే కూటమి ప్రభుత్వం మొగ్గు
- జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- త్వరలో నాసిక్ నుంచి దిగుమతి



జిల్లాలో భూములు, స్థలాలు, ఇతరత్రా రిజిస్ట్రేషన్లకు స్టాంపు డ్యూటీ రూపేణా రూ.300 నుంచి 400 కోట్ల ఆదాయం వస్తోంది. ఇంత ఆదాయం సమకూర్చే ఈ శాఖలో ఆరు నెలలుగా స్టాంపుల కొరత ఉంది. రోజువారీగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరగాలంటే రూ.100, రూ.50 స్టాంపుల అవసరం ఎక్కువగా ఉంటుంది. రూ.కోట్లు, లక్షలు వెచ్చించి భూములు, స్థలాలు రిజిస్ట్రేషన్లు చేసుకొనే వారు స్టాంపులు దొరక్క నానా అవస్థలు పడుతున్నారు. రూ.100, రూ.50 స్టాంపులపై స్థలాలు, భూముల వివరాలు రాసి రిజిస్ట్రేషన్ చేస్తే దానికి ఆకర్షణ, అందంతో కూడిన విలువ ఉంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో స్టాంపుల అమ్మకం ద్వారా వచ్చిన నగదును సీఎఫ్ఎంఎస్‌లో జమ చేశారు. ఆ సొమ్మును కూడా జగన్ సర్కారు ఉచిత పథకాలకు దారి మళ్లించిందనే ఆరోపణలు ఉన్నాయి.

● 10 లక్షల స్టాంపుల అవసరం

జిల్లాలో సంవత్సరానికి 10 లక్షలకుపైగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అవసరం ఉంది. వీటిలో రూ.100 విలువగలవి 6లక్షలు, మిగిలిన 4 లక్షలు రూ.50, 20, 10 విలువ కలిగినవి ఉన్నట్లు తెలిసింది. ప్రతి లక్ష రూపాయల స్టాంపు డ్యూటీకి రూ.600లకు తగ్గకుండా స్టాంపులు వినియోగిస్తుంటారు. ఈ లెక్కన జిల్లాకు 10 లక్షలకుపైగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అవసరం ఉంది. జిల్లాకు నాలుగు దఫాలుగా అవసరాన్ని బట్టి స్టాంపులు రావాల్సి ఉంది. ఈ స్టాంపులను రాష్ట్ర ప్రభుత్వం మహారాష్ట్రలోని నాసిక్ ముద్రణ సంస్థ నుంచి తెప్పిస్తుంది. రూ.100, 50 స్టాంపులు అక్కడ నుంచి రావాల్సి ఉంది. రూ. 10, 20 స్టాంపులు తెలంగాణాలోని ముద్రణ సంస్థ నుంచి కొనుగోలు చేస్తారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపులనే తిరిగి వినియోగంలోకి తేవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో జిల్లాకు ఎన్ని రకాల స్టాంపులో అవసరమో వివరిస్తూ జిల్లా అధికారులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టి ఉన్నారు. ఆ ప్రకారం నాసిక్ నుంచి స్టాంపులను తెప్పించి, జిల్లాకు పంపనున్నారు.

● పోస్టల్ శాఖ నుంచి వాపస్

జిల్లాలో పోస్టల్ కార్యాలయాల్లో కూడా కొంతకాలంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అమ్మకాలు సాగాయి. కానీ చాలా మంది పోస్టాఫీసుకు వెళ్లి కొనుగోలు చేయడానికి ఇష్టపడకపోవటంతో అవి పోస్టాఫీసుల్లో మిగులుగా ఉండిపోయాయి. అమ్ముడుపోని 2.25 లక్షల స్టాంపులు తమ వద్ద ఎందుకని పోస్టల్ శాఖ అధికారులు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి కొంతకాలం కిందట వాపసు చేశారు. ఆ స్టాంపులను ఇటీవల జిల్లా రిజిస్ట్రార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా పంపిణీ చేయించారు.

స్టాంపులు త్వరలో వస్తాయి



జిల్లాకు ప్రస్తుతం 8 లక్షల నాన్ జ్యుడీషియల్ స్టాంపుల అవసరం ఉందని ఇండెంటు పెట్టాము. పోస్టల్ శాఖ నుంచి వాపసు వచ్చిన స్టాంపులను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపుతున్నాం. ప్రస్తుతం స్టాంపుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

- హరివర్మ, జిల్లా రిజిస్ట్రార్, స్టాంపులు రిజిస్ట్రేషన్లశాఖ

తట్ట మట్టి తీస్తే ఒట్టు!

పూడిక, జమ్ముతో నిండిన కావలి సాగునీటి కాలువ

నీరు ఎలా పారుతాయని రైతుల ఆందోళన

జలదంకి, అక్టోబరు 10: ఈ చిత్రంలో మీరు చూసేది సోమశిల రిజర్వాయర్‌లో అంతర్భాగం కావలి కాలువ. ఈ కాలువ ద్వారా లక్ష ఎకరాలకు పైగా సాగునీరు అందాల్సి ఉంది. ఇంతటి ప్రజావసరమైన ఈ సాగునీటి కాలువ దగదర్తి మండలం బోడిగుడిపాడు నుండి చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయరు (సిబిఆర్) వరకు పూడికతో నిండి, జమ్ము ఏపుగా పెరిగి సాగునీరు ముందుకు కదలలేని పరిస్థితి ఉంది. దీనికితోడు కాలువ జీప్‌ట్రాక్‌పై రెండు వైపులా కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. వీటిని తొలగించే ఆలోచనను అటు పాలకులు. అధికారులు చేయలేదు. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఈ కాలువలో తట్టమట్టి తీసిన పాపాన పోలేదు. గత ప్రభుత్వ అధ్వాన పాలనకు నిలువెత్తు సాక్ష్యం ఈ కావలి కాలువ.

రూ.5కోట్లతో పూడికతీతకు ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువ మరమ్మతు పనులు, ఆధునీకరణ పనులకు చర్యలు తీసుకున్నారు. సోమశిల ప్రాజెక్టు అధికారులతో ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వారు కాలువ పరిశీలించి రూ.5కోట్లు ఖర్చు అవుతుందని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.



జలదంకి మండల పరిధిలోని కావలి కాలువ

పాలకులు, అధికారుల నుంచి పనులు చేపట్టేందుకు ఆమోదం వస్తే పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

ముంచుకొస్తున్న వ్యవసాయ సీజన్

రబీసీజన్‌లో కావలి కాలువ కింద రైతులు వరిసాగు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 53టీఎంసీలు నీరు ఉండడంతో ఈ ఏడాది మొదటిపంటకు ఎలాంటి సాగునీటి ఇబ్బందులు ఉండవని రైతులు తలంచారు. కానీ కాలువ దుస్థితి ఈ ఏడాది తాము వరి సాగు చేసి పండిచ్చినట్లే అని చర్చించుకుంటున్నారు. ఈ ఏడాది ధాన్యం రేటు ఆశాజనకంగా ఉండడంతో మరికొందరు రైతన్నలు ముందస్తుగా వ్యవసాయబోర్లు, బావుల కింద ఈ మాసంలోనే నారుమళ్లు పోశారు. నారు వేతకు వచ్చే లోపు కాలువలకు నీరు రాకపోతాయా అనే ఎలా అని ప్రశ్నార్థకంలో ఉన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కావలికాలువ పూడికతీత పనులు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా వెంగమాంబ పల్లకీ సేవ



వెంగమాంబ పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 10: మండలంలోని నర్రవాడలో వెంగమాంబ పేరంటాలమ్మ అమ్మవారి పలకీ సేవను గురువారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, చందన అలంకారం, కుంకుమార్చన, మహానైవేద్యం కార్యక్రమాలు నిర్వహించి అనంతరం పల్లకిసేవ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆసుపత్రి అభివృద్ధికి చేయూత ఇవ్వాలి



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, అక్టోబరు 10 : ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి స్థానికులు ఆర్థిక చేయూతని అందిస్తే పేదలు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించవచ్చని స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఆహార సరఫరా విషయాలపై ఆరాతీశారు. డయాలసిస్ సెంటర్‌ను పరిశీ లించారు. దూర ప్రాంత ప్రజలకు సాధ్యమైనంత వరకు పగటిపూట వైద్యం అందించేలా చూడాలని వైద్యశాల సూపరింటెండ్ శకుంతలకు సూచించారు. వైద్య పరికరాల కొనుగోలుకు స్థానిక నివాసి బొగ్గవరపు నరసింహులు ఎమ్మెల్యే చేతుల మీదగా రూ.2లక్షల చెక్కును ఆసుపత్రి సూపరింటెండ్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, వడ్డేళ్ల రవిచంద్ర, అల్లం వెంకటేశ్వర్లు, మురారి శెట్టి సుధీర్ పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి కృషి

- రేపు కావలిలో ఐక్యతా భవనం ప్రారంభం

కావలి, అక్టోబరు 10: బీసీల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని బీసీ ఐక్యత భవన్ రాష్ట్ర అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్‌రావు, గౌరవాధ్యక్షుడు ఉరిటి గోవింద్, ప్రధాన కార్యదర్శి చిన్ని వరప్రసాద్‌రావులు తెలిపారు. గురువారం వారు కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. పట్టణ కోఆపరేటీవ్ కాలనీలో శనివారం బీసీ ఐక్యతభవన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ జాతీయప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, బీద గిరిదర్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాదయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం హాజరవుతారని చెప్పారు. ఈ సందర్భంగా పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ సోదరులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆవుల శ్రీనివాసులు, ఆవులమంద శ్రీనివాసులు, ఆవుల కోదండపాణి, శివ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు



భద్రత ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ

ఆత్మకూరు, అక్టోబరు 10 : జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఆత్మకూరు డీ ఎస్పీ కె వేణుగోపాల్, సీఐ జి గంగాధరరావు తెలిపారు. గురువారం వారు ఆత్మకూరు పట్టణ సమీపంలోని నెల్లూరుపాళెం సెంటర్ వద్ద నెల్లూరు - ముంబయి జాతీయ రహదారిపై వేగ నియంత్రణకు రేడియం స్టిక్కర్లతో ఏర్పాటుచేసిన డ్రమ్ములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మకూరు మండల సరిహద్దు నుంచి బద్వేల్ సరిహద్దు ప్రాంతం వరకు తరచూ ప్రమాదాలు జరిగే ఏడు ప్రదేశాలను గుర్తించామని, ఆప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లతో డ్రమ్ములను ఏర్పాటుచేశామన్నారు. దీంతో వాహనాలు అతివేగంగా వెళ్లకుండా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. అతివేగం ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఎస్‌ఐ షేక్ జిలానీ పాల్గొన్నారు.

రాళ్లపాడుకు చేరిన సోమశిల జలాలు

లింగసముద్రం, అక్టోబరు 10: సోమశిల ప్రాజెక్టు నుండి విడుదలైన కృష్ణాజలాలు గురువారం మధ్యాహ్నం రాళ్లపాడు ప్రాజెక్టు చేరాయి. ప్రస్తుతం ఉత్తర కాలువ నుండి ప్రాజెక్టులోకి 70క్యూసెక్కుల మేర నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ చంద్రమౌళి తెలిపారు. ప్రస్తుతం సోమశిల నుంచి 540 క్యూసెక్కుల నీరు ఉత్తర కాలువకు విడుదల చేస్తున్నారని, మరో 60 క్యూసెక్కులు పెంచి 600 క్యూసెక్కుల విడుదలచేస్తే ప్రాజెక్టులోకి 100 క్యూసెక్కుల మేర నీరు వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వస్తున్న నీరు అడుగు మేర చేరాలంటే కనీసం వారం రోజులు పడుతుందన్నారు.

అడ్డుకోవడమనేది అపోహ మాత్రమే




దరఖాస్తుదారుల వివరాలు నమోదు చేసుకుంటున్న శ్రీనివాసులనాయుడు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 10: మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకొనే వారిని అడ్డు కోవడమనేది అపోహ మాత్రమేనని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఏ శ్రీనివాసుల నాయుడు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి దరఖాస్తుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ నూతన మద్యం పాలసీకి సంబంధించి మూడు పద్ధతుల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, దరఖాస్తుల ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, ఎవరైనా ధైర్యంగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. శుక్రవారం సాయంత్రానికి దరఖాస్తుల ప్రక్రియ ముగుస్తుందని, సమయం ముగిసినా క్యూలో ఎంతమంది ఉంటే అంతమందికి అవకాశం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ లక్ష్మణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు మద్యం దుకాణాలకు 67 దరఖాస్తులు

లింగసముద్రం: మండలంలోని రెండు మద్యం షాపులకు కలిపి 67 దరఖాస్తులు వచ్చాయి. కందుకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ బి వెంకట్రావు అందించిన సమాచారం మేరకు గురువారం రాత్రి 8 గంటల వరకు లింగసముద్రంలోని 175వ షాపుకు 34 దరఖాస్తులు, 176వ షాపుకు 33 దరఖాస్తులు వచ్చాయన్నారు. మొత్తంగా 175వ షాపునకు 34 దరఖాస్తులు వచ్చాయి. ఇవి నియోజకవర్గంలోనే అత్యధికంగా దరఖాస్తులు. కందుకూరు నియోజకవర్గంలోని 17 మద్యం షాపులకు 265 దరఖాస్తులు వచ్చా యన్నారు. మండలంలో ఐదారుగురు కలిసి దరఖాస్తులు చేసినట్టు తెలిసింది. వీరిలో ఒక్కరికి షాపు వచ్చినా అందరూ కలిసి చేసుకోవచ్చని గానీ, లేక ఏదోవిధంగా సెటిల్‌మెంటు చేసుకోవచ్చని భావిస్తున్నట్టు తెలిసింది. శుక్రవారం సాయంత్రం 7గంటల వరకు దరఖాస్తులకు గడువు ఉందని, మరికొన్ని దరఖాస్తులు రావచ్చని సీఐ వెంకట్రావు ఆశాభావం వ్యక్తం చేశారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాతున్న డీపీవో

ఆత్మకూరు, అక్టోబరు 10: గ్రామ పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆత్మకూరు డివిజన్ స్థాయిలో పంచాయతీ అధికారులు, కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లోని పంచాయతీల్లో నిల్వ ఉన్న సాధారణ నిధులు, 2025 మార్చి 31లోపు రాబోవు 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో 20 రకాల అభివృద్ధి పనులు మాత్రమే చేపట్టాల్సి ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి డి నారాయణ, ఆయా మండలాల ఈవోఆర్డీలు, పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు 16 వినతులు

కావలి, అక్టోబరు 10: స్థానిక ఆర్టీసీ కావలి డిపోలో గురువారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి 16వినతులు వచ్చినట్లు డీఎం రాపూరు శ్రీనివాసులు తెలిపారు. అల్లూరులో బస్సుల రాకపోకల వేళల బోర్డు ఏర్పాటు, కొమ్మి హైస్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయుల అభ్యర్థన మేరకు బస్సు వేళలు మార్చామన్నారు. వేములపాడు బస్సును కృష్ణాపాడు వరకు పొడగించినట్లు తెలిపారు. చాకలికొండ, పాములూరు గ్రామాలకు కొత్త బస్సులు రాగానే ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు.

సూర్యప్రభపై శ్రీవారి వైభోగం



సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

కావలి టౌన్, అక్టోబరు 10: స్థానిక బృందావనం కాలనీలోని వెంకటేశ్వరస్వామికి ఉదయం సూర్యప్రభ, రాత్రికి చంద్రప్రభ వాహనసేవలు అందించారు. టీటీడీ అర్చక బృందం ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్‌మాల్యాద్రి పర్యవేక్షించారు. రాత్రి శ్రీవారు గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

ఉదయగిరి ఎమ్పీడీవోగా అప్పాజీ

ఉదయగిరి రూరల్, అక్టోబరు 10: ఇన్‌చార్జి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఏ అప్పాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మను ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. కలిగిరి మండల ఈవోపీఆర్డీగా పనిచేస్తున్న అప్పాజీని ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్నతాధికారులు నియమించడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 10: మండలంలోని రాచవారిపల్లి గ్రామంలో గురువారం సీడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ప్రొఫెసర్ రామిరెడ్డికి సన్మానం



రామిరెడ్డిని సన్మానిస్తున్న అపస్ నేతలు

వింజమూరు, అక్టోబరు 10: మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో అక్టోబరు 4, 5, 6 తేదీల్లో జరిగిన అఖిల భారతీయ రాష్ట్రీయ సైక్షిక్ మహాసంఘం (ఏబీఆర్ఎస్ఎం) జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ఏబీఆర్ఎస్ఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న వింజమూరు వాసి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి జాతీయ కార్యవర్గ సభ్యునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వింజమూరు శాఖ గురువారం ఏబీఆర్ఎస్ఎం అనుబంధ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (అపస్) వింజమూరు శాఖ ఆపస్ కార్యాలయంలో ప్రొఫెసర్ వైవి రామిరెడ్డికి అభినందనలు తెలియజేసి సన్మానించారు. ఈ సందర్భంగా వైవి రామిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో జాతీయ కార్యవర్గ సభ్యునిగా నియమించడం పట్ల జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపస్ రాష్ట్ర కార్యదర్శి పలుకూరి వెంగయ్య, వింజమూరు మండల ఆపస్ నాయకులు కందల మధు, మండవ ప్రభాకర్, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, చలమయ్య, పాల్గొన్నారు.

రతన్ టాటా మరణం తీరనిలోటు

కావలి, అక్టోబరు 10: ప్రపంచం మెచ్చిన వ్యాపార దిగ్గజం రతన్ టాటా అని అలాంటి గొప్ప వ్యక్తి మరణం దేశానికి తీరనిలోటని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలి పారు. లక్షల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి కోట్ల మంది జీవి తాలలో వెలుగులు నింపిన మహనీయుడని కొనియాడారు. వారి ఆత్మ కు శాంతి కలగాలని భగవంతుడిని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

బీద మస్తాన్‌రావు టీడీపీలో చేరికపై హర్షం

లింగసముద్రం, అక్టోబరు 10: మాజీ ఎంపీ బీద మస్తాన్‌రావు తిరిగి టీడీపీలో చేరడం మంచి పరణామం అని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి బోడి సురేష్, నాయకులు చిట్టిబోయిన సుధాకర్‌లు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయన సొంత గూటికి చేరడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



ఆత్మకూరు : దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరీదేవి



ఉదయగిరి రూరల్: శివాలయంలో విజయకనకదుర్గాదేవి అలంకరణ



సంగం: దుర్గాదేవి అలంకారంలో కామాక్షిదేవి అమ్మవారు



వరికుంటపాడు: మహాగౌరీగా మానసాదేవి

ఆత్మకూరు, అక్టోబరు 10: శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా గురువారం పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, శివాలయంలో అమ్మ వారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు. తిరునాళ్ళతిప్పలోని కాశీనాయన ఆశ్ర మంలో శ్రీశివనాగకనకదుర్గాదేవి మహిషాసురమర్ధ ని అలంకరణలో, ఉత్తర బలిజవీధిలో జ్వాలాముఖి ఆలయంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు శోభిల్లారు. అమ్మవారికి అభిషేకం, విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. దుర్గాష్టమి సంద ర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

●**ఉదయగిరి రూరల్:** ఉదయగిరి పట్టణం లోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతానలక్ష్మిదేవి ఆలయాల్లో అమ్మవారు విజయకనకదుర్గాదేవి, శ్రీదు ర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

●**సంగం:** సంగమేశ్వరాలయంలో గురువారం రాత్రి కామాక్షిదేవి దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజ లు చేశారు. అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు.

●**కందుకూరు:** స్థానిక పెద్ద బజారులోని కన్యకా పరమేశ్వరి, అంకమ్మ, కనకదుర్గమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభి షేకాలు నిర్వహించారు.



కందుకూరు: దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు

●**వరికుంటపాడు:** తూర్పురొంపిదొడ్లలో మానసాదేవి ఆలయంలో అమ్మవారు గురువారం మహాగౌరి అల ంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంట పాడులోని శ్రీ నాగ రప్పమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

●**సీతారామపురం:** శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి శాలలో మహిషాసురమర్ధనీ అలంకరణలో, నారాయణంపేటలోని శ్రీ విజయ కనకదుర్గా దేవి ఆలయంలో దుర్గాదేవి అలంకరణలో భక్త లకు దర్శనం ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.

●**అల్లూరు:** స్థానిక పోలేరమ్మ, కలుగోళమ్మ, కన్యకాపరమేశ్వరి, పార్వతీ అమ్మవారు, నార్తుమోపూరు మహాలక్ష్మమ్మ, ఇస్కపల్లి అంక మ్మలకు దుర్గాష్టమిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అల్లూరు కలుగోళమ్మ ఆలయంలోని సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు.

●**కలిగిరి:** తెల్లపాడు భద్రకాళి అమ్మవారు దుర్గాదేవి అలం కరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు కుంకు మార్చన, అష్టోత్తర పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా భద్రకాళి అమ్మవారి ఆలయానికి నూతక్కి వెంకటశేషాచారి జ్ఞాపకార్థం వారి భార్య ప్రమీలరాణి మినీ వాటర్ కూలర్‌ను అందజేశారు.

●**చిట్రగుంట:** విశ్వనాథరావుపేట కోదండరామాలయంలోని రాజరాజేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులు సామూహిక కుంకుమార్చన చేపట్టారు. బోగోలు సాయి మందిరం, రామ స్వామి పాలెం రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి.

●**కావలి టౌన్:** దుర్గాష్టమి పర్వదినంను పురస్కరించుకుని పట్టణంలోని కలుగోళశాంభవి అమ్మవారు దుర్గాదేవి అలం కరణలో దర్శనమిచ్చి పులి వాహన సేవలందుకున్నారు. పా తూరు శివాలయం లోని దుర్గాభ్రమ రాంబ దుర్గా దేవిగా, విష్ణాలయం రాజ్యలక్ష్మీ సంతాన లక్ష్మీగా, వడ్డెపాలెం కనక దుర్గా దేవి దుర్గాదేవి అలంకరణలో, ముసునూరు మహాలక్ష్మమ్మ మహిషాసురమర్ధిని అలంకర ణలో దర్శనమి చ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రం దుర్గాదేవికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.



కావలి టౌన్: దుర్గాదేవి అలంకరణలో కలుగోళశాంభవి

నాలుగు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

చేజర్ల, అక్టోబరు 10: పెన్నానది పరీవాహక గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వేమారెడ్డి హెచ్చరించారు. గురువారం తెల్లవారు జామున మండలంలోని ఉలవపల్లి గ్రామం నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను చేజర్ల ఎస్ఐ ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వాధీనం చేసుకుని చేజర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేజర్ల పోలీస్ స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి మాట్లాడుతూ సంగం సర్కిల్ పరిధిలోని సంగం, ఏఎస్ పేట, చేజర్ల మండలలాలకు చెందిన ప్రజలకు సంగం ఇసుక నిల్వ కేంద్రం వద్ద ఇసుక అందుబాటులో ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్రమ రవాణా జరిగితే సహించేది లేదని బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.ప్రభాకర్ పాల్గొన్నారు

అదుపుతప్పి కారు బోల్తా



అదుపుతప్పి పొలంలో పడిన కారు

సీతారామపురం, అక్టోబరు 10 : మండల పరిధిలోని పోకలవారిపల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న హైవేపైనుంచి కారు అదుపుతప్పి పక్కన పొలాల్లో పడిన సంఘటన గురువారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు... సీతారామపురం నుంచి ఉదయగిరి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుందని, కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారని తెలిపారు.

వరి సాగుపై రైతులకు శిక్షణ

కలువాయి, అక్టోబరు 10 : స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో గురువారం వరిసాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు మారుతీదేవి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో బీపీటీ 5204 రకం వరిసాగుకు అక్టోబరు 15 నుంచి నవంబరు 15వ తేదీ లోపు నార్లు పోసుకోవాలని, కేఎన్ఎం 1638 నవ ంబరు మొదటివారం, ఆర్ఎన్ఆర్ 15048 నవంబరు 15వ తేదీ తరువాత అనుకూలమని తెలిపారు.

ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

కొండాపురం, అక్టోబరు 10: మండల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఎమ్.వెంకటరావును గురువారం టీడీపీ మండల నాయకులు పోలినేని రమేష్, పోలినేని చంద్రబాబు, చాగంటి క్రిష్ణ, చిట్టాబత్తిన మాచెర్ల, మార్నేని ప్రత్యూష్‌లు కలిసి శాలువాతో సత్కరించారు.

రోడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు

కలువాయి, అక్టోబరు 10 : మండలంలో రూ.2కోట్ల నిధులతో 37 సిమెంటు రోడ్ల నిర్మాణ పనులు చేపట్ట నున్నట్లు ఏపీవో మురళీ తెలిపారు. ప్రభుత్వం ఈనెల 14వ తేదీ నుంచి చేపట్టనున్న పల్లె పండుగ కార్యక్రమంలో ఈ పనులు ప్రారంభించనున్నారు. ఉపాధిహామీ పథకం నిధు లతో నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులకు ఈనెల 18వ తేదీన వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శంకు స్థాపన చేయనున్నారు. నూకనపల్లి-2, బద్దెవోలు-1, కుల్లూ రు-2, మాదన్నగారిపల్లె-1, చింతలపాళెం-2, తోపుగుంట-2, బాలాజీరావుపేట-2, చీపినాపి-2, పర్లకొండ-2, కేశమ నేనిపల్లి-2, కనుపూరుపల్లి-2, చిన్నగోపవరం-2, చవట పల్లి- 2, దాచూరు-2, పెరంకొండ-2, కలువాయి-7, తెలుగు రాయ ఫురం-2, చింతలాత్మకూరు-1 పనులు మంజూరయ్యాయి.

బదిలీ అధికారులకు సన్మానం

చిట్రగుంట, అక్టోబరు 10: విశ్వనాథరావుపేట పంచాయతీ కార్యదర్శులు మహ్మద్ బాషా, చైతన్య, అసిస్టెంట్ ఇంజినీరు రమ్య, సునీల్, తేజ, సర్వేయర్ జావీద్‌లను గురువారం సర్పంచ్ గండూరి మంజుల సన్మానించారు.

కూలీలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న సభ్యులు

వరికుంటపాడు, అక్టోబరు 10: స్థానిక బొగ్గుబట్టీల్లో పనులు చేసుకొని జీవనం సాగించే కూలీలకు గురువారం వినియోగదారుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షుడు మేకపాటి మాల్యాద్రినాయుడు ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని దుస్తులను పంపిణీ చేశారు. ప్రకాశం జిల్లా పామూరుకు చెందిన దాతలు దర్శి సత్యనారాయణ, పాబోలు శివ సహకారంతో దుస్తులు సేకరించి పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు చల్లగాలి వెంకటమోహన్, బాధ్యులు ధనేంకుల వెంకటనవీన్, పొద మల్లికార్జున, మట్టె నరేష్, నిఖిల్, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండుగ

ఉలవపాడు, అక్టోబరు 10: పల్లె పండుగ పంచాయతీ గ్రామసభల వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20వరకు నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో ఎన్.విజయ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 14న చాకిచర్ల, పెద్దపట్టపుపాలెం, చాగొల్లు గ్రామాలలో, 15న రామాయపట్నం, వీరేపల్లి, 16న బద్దిపూడి, భీమవరం, 17న ఉలవపాడు, కృష్ణాపురం, 18న ఆత్మకూరు, మన్నేటికోట, 19న కరేడులో సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

అల్లూరు, అక్టోబరు 10: స్థానిక మండల సమావేశం భవనంలో జరిగిన ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ మాట్లాడారు. ప్రజాప్రతినిధులు పంచాయతీల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రజనీకాంత్, ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, జల్‌జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ శర్మ, రిసోర్స్ పర్సన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

దామిశెట్టి మల్లికార్జునకు నేతల పరామర్శ

కావలి టౌన్, అక్టోబరు 10: దుండగుల దాడిలో గాయపడి నెల్లూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దామిశెట్టి మల్లికార్జునను గురువారం మాజీ మంత్రి కాకాణి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ముసుగులు ధరించిన దుండగులు దాడి చేయడం పిరికిపంద చర్య అన్నారు. ఈ విషయంపై ఎస్పీతో కలిసి దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. వారి వెంట నాయకులు దామిశెట్టి సుధీర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.